Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 27.11.2015, శుక్రవారం

సంపుటి : 35 సంచిక : 26

పేజీలు : 12, వెల : ₹ 5



Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
ISO 9001-2008
CARE
SUPER SPECIALITY
DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

## నాయకులను, అధికారులను పరుగులెత్తించిన



# 'చంద్ర'శాసనుడు



- జిల్లా నాయకులపై నిప్పులు కక్కిన సీఎం
- బాగుపడుతున్న నెల్లూరు నగరం
- కాలువల ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం

ఏం చేస్తున్నారు మీరంతా... ఏమవ్వాలి పార్టీ పరిస్థితి... మీ నిర్వాకానికి నేను నిందలు మోయాలా... మంత్రేం చేస్తున్నాడు... ఎమ్మెల్యేలు ఏం వెలగబెడుతున్నట్లు... ఒకరికి ఇద్దరికి ఎమ్మెల్సీలిచ్చాను... ఇందు కోసమేనా? దీనిని నగరమంటారా? నెల్లూరు కార్పొరేషన్ ఏం చేస్తుంది, జనం నగరంలో వున్నారా? లేక సముద్రంలో వున్నారా? ప్రతిపక్షం బలహీనంగా ఉండబట్టి సరిపోయింది, లేకుంటే మన పరువు ఏమయ్యేది... జిల్లా తెలుగుదేశం నాయకులకు, ప్రజాప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీరియస్‌గా పీకిన క్లాస్ ఇది.

(మిగతా 11వ పేజీలో)

• ఆనం ఇంట



# తెలుగు వెలుగులు

నెల్లూరుజిల్లాలో శక్తివంతమైన రాజకీయ కుటుంబంగా ముద్రపడ్డ ఆనం కుటుంబం ఇక తెలుగుదేశంపార్టీతో కలిసి ప్రయాణం కొనసాగించబోతోంది. ఈమేరకు తెలుగుదేశంలో చేరాలని ఆనం సోదరులు నిర్ణయించుకున్నారు. ఆనం వివేకానందరెడ్డి, ఆనం రామనారాయణరెడ్డితో పాటు వారి సోదరుడు ఆనం విజయకుమార్‌రెడ్డి, కుమారులు ఏ.సి.సుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డిలు కూడా పసుపు చొక్కాలు తగిలించుకోనున్నారు.

(మిగతా 11వ పేజీలో)

మేము నమ్మకాన్ని కలిగిస్తాం... క్యాన్సర్ పూర్తిస్థాయి నివారణకు

GLOBAL HEALTH CITY
more to life

క్యాన్సర్ చికిత్సలో నూతన ఒరవడి అత్యాధునిక రేడియోథెరపి మిషను ద్వారా తక్కువ రోజుల వ్యవధిలో తిరిగి సాధారణ జీవనశైలి.



క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌లో ప్రతి అవయవ క్యాన్సర్‌కు సంబంధించి ప్రత్యేక డాక్టరు ను కలిగిన ఏకైక సంస్థ

క్యాన్సర్ సంరక్షణలో అవయవ నిర్థిష్టతను తెలిపే సూపర్ స్పెషాలిటి హాస్పిటల్

- తల మరియు మెడ సంబంధిత క్యాన్సర్ సంరక్షణ
- రొమ్ము సంబంధిత క్యాన్సర్ సంరక్షణ
- కాలేయ సంబంధిత క్యాన్సర్ సంరక్షణ
- మెదడు సంబంధిత క్యాన్సర్ సంరక్షణ
- వెన్నుముక సంబంధిత క్యాన్సర్ సంరక్షణ
- జీర్ణకోశ మరియు పేగు సంబంధిత క్యాన్సర్ సంరక్షణ
- స్త్రీ జననేంద్రియ సంబంధిత క్యాన్సర్ సంరక్షణ
- మూత్ర కోశ సంబంధిత క్యాన్సర్ సంరక్షణ
- ఊపిరితిత్తుల సంబంధిత క్యాన్సర్ సంరక్షణ
- కీళ్ళ సంబంధిత క్యాన్సర్ సంరక్షణ
- ఆంకో ప్లాస్టిక్ మరియు పునర్నిర్మాణం నందు క్యాన్సర్ సంరక్షణ

trueBEAM STx క్యాన్సర్ చికిత్స కోసం ప్రపంచం లోనే అత్యంత అధునాతన రేడియేషన్ థెరపీ వ్యవస్థ

- ఆంకాలజి నివారణ
- ఇంటర్‌వెన్షనల్ ఆంకాలజి
- మెడికల్ ఆంకాలజి
- రేడియేషన్ ఆంకాలజి
- ఎముక మజ్జ మార్పిడి
- శస్త్ర సంబంధిత ఆంకాలజి
- నొప్పి నుండి ఉపశాంతి మరియు రక్షణ నిచ్చే వైద్యం

- అంతర్జాతీయ వైద్య సేవలను అంకిత భావంతో పేషంట్లకు అందించే వైద్య బృందం
- ప్రత్యేక మైన అనుభవజ్ఞులైన సహాయ కేంద్రాలు మరియు జపనీస్ వారి సహాయ కేంద్రం
- ఫ్రెంచ్, అరబిక్, జపనీస్ మరియు ఇతర భాషల కొరకు ట్రాన్స్‌లేటర్ల సదుపాయం కలదు
- అంతర్జాతీయ భీమా మరియు ఇన్సూరెన్స్‌ల ప్రవేశ సదుపాయం కొరకు అనుభవజ్ఞులైన ట్రాన్స్‌లేటర్లు

www.globalhospitalsindia.com

గ్లోబల్ హెల్త్‌సిటీ, 439 చెరన్‌నగర్, పెరుంబాకం, షోలింగ నల్లూరు, చెన్నై - 600100
Ph: +91 - 44 - 4477 7000, Email: infochennai@globalhospitalsindia.com

గ్లోబల్ ఇన్‌ఫర్‌మేషన్ సెంటర్, నెం. 16-2-230, కైజన్ హైట్స్, సండేమార్కెట్, పొగతోట, నెల్లూరు -1.
ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్: 9989777101,7880931555, 8978788116, 8978788115

24/7 UDANAE GLOBAL Emergency Care
044-4624 2424

## ఊబకాయంతో జాగ్రత్త సుమా!?

ప్రపంచ ఊబకాయం వ్యతిరేకదినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నవంబర్ 26న జరుపుకుంటున్నారు. ఊబకాయం ఎన్నో రోగాలకు తల్లి లాంటిది. ఎయిడ్స్ కన్నా ప్రమాదకరమైనది ఊబకాయం. ఇది ఒక టైంబాంబు లాంటిది. ఏ క్షణమైనా పేలిపో గలదు జాగ్రత్త సుమా! ఊబకాయం ఆధునిక జీవనశైలికి సంబంధించిన రుగ్మత. 50శాతం మహిళలు, 33శాతం పురుషులు ఊబకాయం కలవారే. ఊబకాయం తగ్గడానికి వున్నవి రెండే మార్గాలు. ఒకటి డైటింగ్, రెండవది ఎక్సర్‌సైజ్. ప్రపంచ ఊబకాయ దినోత్సవం సందర్భంగా నెల్లూరు ఇందిరాభవన్ రోడ్డులో వున్న విజయా లేబొరేటరి అండ్ ఒబెసిటి క్లినిక్ అధినేత, స్థూలకాయం వైద్య నిపుణులు డా॥ యం.పెంచలరెడ్డి స్థూలకాయులకు ఉచితంగా కౌన్సిలింగ్ ఇస్తున్నారు. శాస్త్రీయ పద్ధతుల ద్వారా ఆయుర్వేద, యోగా, నేచర్‌క్యూర్ ద్వారా ఊబకాయాన్ని తగ్గిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని స్థూలకాయులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

## నష్టాల పరిశీలనకు 300 మంది డీటీలు

వరద సహాయక చర్యలు చేపట్టేందుకు, వరద నష్టాలను పరిశీలించి నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించేందుకు జిల్లాకు అవసరమైన 300 మంది డిప్యూటి తహశీల్దార్లను ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే 10 మంది ఐఏఎస్‌లు, 20 మంది డిప్యూటి కలెక్టర్లు, 200 మంది తహశీల్దార్లు, ఎంపిడిఓలు జిల్లాకు చేరుకున్నారు కూడా. వరదల ధాటికి దెబ్బతిన్న రోడ్లకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి, వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నారు.

# అక్వా రైతులను ఆదుకోవాలి

జిల్లాలో భారీ వర్షాల వల్ల ఆక్వా రంగానికి సుమారు రెండువేల కోట్లకు పైగానే నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం వెంటనే ఆక్వా రైతాంగాన్ని ఆదుకోవాలని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి కోరారు. ఈ నెల 21న ఆయన బాలాయ పల్లి మండలంలోని కయ్యూరులో వరద బాధితులను పరామర్శించారు. కయ్యూరు చెరువు గండిని పరిశీలించారు. జిల్లాలో వివిధ పంటలు వేసుకున్న రైతాంగం ఈ భారీ వర్షాల ధాటికి భారీగా నష్టపోయా రని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మకూరు, ఉదయగిరి, వెంకటగిరి నియోజకవర్గాల్లో పెసర, మినుము తదితర పంటలు వేసుకున్న రైతులు బాగా నష్టపోయారని, రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుని ఈ కష్ట సమయంలో తగు చేయూత అందించాలని ఆయన కోరారు.

చెరువులకు పడిన గండ్లను వెంటనే పూడ్చేందుకు అధికారయంత్రాంగం కదిలి రావాలని కోరారు. ప్రభుత్వం అందజేస్తున్న సాయం బాధితులందరికీ సక్రమంగా అందేలా చూడాలన్నారు. అధికారులు గ్రామాల్లో తిరిగి పరిస్థితులను పరిశీలించ కుండా కార్యాలయాలకే పరిమితం కావడం మంచిదికాదన్నారు. వెంటనే బాధితులను ఆదుకునేందుకు సమాయత్తం కావాలన్నారు. బాలాయపల్లి మండలం లోని అలిమిలి వద్ద వున్న కల్వర్టులు రెండు కూలిపోయి వాహనాల రాకపోకలకు జనం బాగా అవస్తలు పడుతున్నారని, వీటికి వెంటనే మరమ్మతులు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్సీపి జిల్లా ప్రధాన కార్య దర్శి గూడూరు భాస్కరరెడ్డి, మండలా ధ్యక్షుడు మురళీమోహన్‌రెడ్డి, నాయకులు గోపికృష్ణారెడ్డి, సురేంద్రరెడ్డి, కయ్యూరు సర్పంచ్ మనోజ్ రవి, యాచవరం సొసైటీ ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్‌షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

నెల్లూరుజిల్లా వ్యాప్తంగా పలు రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వ హించారు. ఆరు దుకాణాల్లో అవకతవకలు ఉండటంతో 6ఏ కింద కేసులు నమోదు చేసారు. వరద బాధితులకు నిత్యావసర పంపిణీల్లో తేడాలున్నాయన్న సమాచారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికా రులకు అందింది. దీంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ రమేషయ్య ఆదేశాల మేరకు డిఎస్పీ పి.వెంకటనాథ్‌రెడ్డి తన సిబ్బందితో కలసి సోమవారం జిల్లా వ్యాప్తంగా గూడూరు, నెల్లూరురూరల్ సబ్‌డివిజన్లలోని 24 రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆరు దుకాణాల్లో అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఈ దాడుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్‌పెక్టర్లు కె.శ్రీనివాస రావు, యు.సత్యనారాయణ, ఏఓ ధనుం జయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చెంగాళమ్మకు వెండిపాత్ర


సూళ్ళూరుపేట పట్టణంలో కొలువై వున్న శ్రీ చెంగాళ పరమేశ్వరి అమ్మవారికి ఈ నెల 21న దాతలు మంతెన మదన్ మోహన్‌రాజు, అలవల వెంకట శ్రీనివాస రావు, కనుమర్లపూడి సురేష్‌లు కలసి మూడు కిలోల బరువున్న వెండిపాత్రను బహుకరించారు. ఆలయ పాలకమండలి ఛైర్మెన్ ఇసనాక హర్షవర్ధన్‌రెడ్డి ద్వారా అమ్మవారికి ఈ వెండిపాత్రను సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు దొరబాబురెడ్డి, ఐతా శ్రీధర్, వేణుయాదవ్ పాల్గొన్నారు.

## పోలీసు అధికారుల బదిలీలు

నెల్లూరు ట్రాఫిక్ డిఎస్పీగా గుంటూరు రేంజ్‌లో విఆర్‌లో వున్న నిమ్మగడ్డ రామా రావును నియమించారు. ఇక్కడ డిఎస్పీగా వున్న ఎం.జనార్ధన్‌ను కర్నూలుజిల్లా మహిళా పోలీసుస్టేషన్ డిఎస్పీగా బదిలీ చేసారు. అలాగే నెల్లూరులోని బాలాజీనగర్ సిఐగా గుంటూరు రేంజ్ విఆర్‌లో వున్న అబ్దుల్ కరీంను నియమించారు. ఇక్కడ వున్న బాజీజాన్ సైదాను నెల్లూరు సిసిఎస్ సిఐగా బదిలీ చేసారు. సిసిఎస్‌లో వున్న ఎస్‌వి రాజశేఖర్‌రెడ్డిని విఆర్‌లో వుంచారు.

## ఎస్ఐ సస్పెండ్

నెల్లూరు నాలుగోనగర ఎస్ఐ కృష్ణా నందంను సస్పెండ్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజి ఎస్.సంజయ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో అల సత్వం వహించడంతో పాటు, సిఐ సీతా రామయ్యతో వచ్చిన విభేదాల నేపథ్యంలో ఆయనపై సస్పెండ్ వేటు పడినట్లు తెలు స్తోంది. నాలుగో నగర ఎస్ఐగా విఆర్‌లో వున్న గిరిబాబును నియమించారు.

# ఆదుకోవడంలో ముందుంటున్నాం

**- కలెక్టర్ యం.జానకి**



వరద బాధితులను ఆదుకోవడంలో శక్తివంచన లేకుండా అధికార యంత్రాంగం కృషి చేస్తోందని జిల్లా కలెక్టర్ యం.జానకి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా జిల్లాలో 66మంది మృతి చెందారని, 1350కోట్ల నష్టం సంభవించినట్లు అంచనా వేసామని అన్నారు. పూర్తి స్థాయి నివేదికలు వచ్చాక నష్టంపై స్పష్టత వస్తుందన్నారు. మూడు ప్రాంతాల్లో పునరావాస శిబిరాలు నిర్వహిస్తుండగా మొత్తం 2300మంది ఈ శిబిరాలలో తల దాచుకుంటున్నారని ఆమె చెప్పుకొచ్చారు. 1.26లక్షల ఎకరాలలో సాధారణ పంటలు, 11వేల ఎకరాలలో ఉద్యానవన పంటలు, 15వేల ఎకరాల్లో రొయ్యల గుంటలు దెబ్బ తిన్నట్లు తెలిపారు. పంట నష్టాల అంచనాకు ప్రత్యేక బృందాలతో సర్వే చేయిస్తున్నట్లు తెలిపారు. 50మంది డిటిలు చౌకదుకాణాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారని, బాధితులకు అందాల్సిన పరిహారాన్ని ఎవరూ మెక్కినా కఠిన చర్యలుంటాయని ఆమె హెచ్చరించారు. నెల్లూరులో ఇరిగేషన్ కాలువల ఆక్రమణపై సర్వే జరుగుతుందని, నివేదికలు వచ్చాక ఆక్రమణలు తొలగిస్తామన్నారు. జిల్లాలో కూలిన ఇళ్ల వివరాల కోసం 249 బృందాలను ఏర్పాటు చేసామని, జాబితాలో తమ పేర్లు లేకపోతే బాధితులు తహశీల్దార్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

## జిల్లాలో విస్తృతంగా జగన్ పర్యటన

# మీకు అండగా నేనున్నా!





వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, ప్రతిపక్షనేత వై.యస్. జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 24, 25, 26తేదీలలో జిల్లాలోని వరద ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. 24వ తేదీ కడప జిల్లాలో పర్యటన ముగించుకుని వెంకటగిరిలో ప్రవేశించారు. ఉదయం పోలేరమ్మ గుడిలో పూజలు చేసిన అనంతరం వెంకటగిరిలోని రాజావీధి, పాతకోటవీధి, కైవల్యానది కూడలి తదితర ప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. చేనేత కుటుంబాలుంటున్న ప్రాంతానికి వెళ్లి అక్కడ తడిసిన మగ్గాలను పరిశీలించారు. చేనేత కుటుంబాలకు అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. బంగారుపేట, నాయుడుపేట, మేనకూరులలో పర్యటించారు. అక్కడ నుండి చిట్టమూరు, వాకాడు మండలాలకు వెళ్లి బాధితులను ఓదార్చారు. 24వ తేదీ రాత్రి వాకాడు మండలం గొల్లపాలెంలో బస చేసిన ఆయన 25వ తేదీ కోట, వాకాడు, చిల్లకూరు గూడూరు మండలాలలో పర్యటించారు. మనుబోలు వద్ద తెగిన జాతీయ రహదారిని పరిశీలించారు. జగన్‌ను చూడాలని, ఆయనకు తమ బాధలు చెప్పుకోవాలని చాలామంది మహిళలు, వృద్ధులు ఆయన వచ్చేంత వరకు ఎదురుచూడడం జరిగింది. 25వ తేదీ రాత్రికి నెల్లూరు చేరుకున్న జగన్ 26వ తేదీ ఉదయం నెల్లూరులోని పలు ముంపు ప్రాంతాలలో పర్యటించారు. బాధితుల బాధలను స్వయంగా విన్నారు. వరద సహాయక పంపిణీలో అధికార పార్టీ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని, జిల్లాలో వచ్చిన వరదలు అవినీతి నేతలకు వరమయ్యాయని ఆయన దుయ్యబట్టారు.

ఈ పర్యటనలో ఆయన వెంట ఎంపీలు వై.వి.సుబ్బారెడ్డి, వరప్రసాద్, మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్, కిలివేటి సంజీవయ్య, మేకపాటి గౌతంరెడ్డి, పాశం సునీల్‌కుమార్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నీడ కల్పించి తొలగించండి



నగరంలో ఆక్రమణల తొలగింపుకు తాము వ్యతిరేకం కాదని, అయితే పేదలకు పునరావాసం కల్పించి వారి ఇళ్లను తొలగించాలని నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నెల్లూరు వహబ్‌పేటలో పర్యటించారు. రిలీఫ్‌క్యాంపుల నుండి తమ ఇళ్లకు వెళుతున్న వరద బాధితులను పరామర్శించి వారికి మంచినీటి క్యాన్లు, ఆహార పొట్లాలను అందజేశారు. ఆక్రమణల తొలగింపు పేరుతో పేదలను వీధుల పాలు చేయొద్దని, వారికి ప్రత్యామ్నాయంగా ఇంటి నివేశ స్థలాలు చూపించి మంచినీళ్లు, లైట్లు, రోడ్లు వంటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు 50వేల ఎకరాల భూములు సేకరించిన అధికారులు, పేదల ఇళ్ల కోసం భూమిని ఎందుకు సేకరించలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, హరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ చేయూత




ఇటీవల సంభవించిన భారీ వర్షాలకు నెల్లూరు నగరం, చుట్టు ప్రక్కల గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. దీంతో గత వారం రోజులుగా లయన్స్ క్లబ్ ఆఫ్ నెల్లూరు, నెల్లూరు పినాకిని, నెల్లూరు ప్రగతి, నెల్లూరు సేవాప్రియ ఆధ్వర్యంలో బాధితులకు ఆహార పొట్లాలు, బ్రెడ్లు, మంచినీరు తదితరాలను పంపిణీ చేశారు. ఈ క్రమంలో మంగళవారం నెల్లూరు దర్గామిట్టలోని అచ్యుత సుబ్రహ్మణ్యం కళ్యాణ మండపంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ కె.చిన్నపరెడ్డి దాదాపు 7లక్షల రూపాయలు విలువజేసే దుస్తులు, పాత్ర సామానులు గల కిట్‌లను నెల్లూరుజిల్లాలోని 900మంది నిరుపేద కుటుంబాల వారికి నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలు అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ద్వారా అందజేశారు. అనంతరం అచ్యుత సుబ్రహ్మణ్యం దాతృత్వంతో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ లయన్స్‌క్లబ్ తరఫున వై.శ్రీనివాసరావు, ఎన్.వి.రమణయ్య, వై.అమృతవల్లి, అధ్యక్షులు తోట నాగరాజు, లయన్స్ క్లబ్ ఆఫ్ పినానికి అధ్యక్షులు కోట రమేష్, లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రగతి అధ్యక్షులు పి.సత్యనారాయణ, లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా ప్రియ అధ్యక్షులు జి.అనూరాధ, రీజియన్ ఛైర్మెన్ పి.ఆంజనేయులు, జోన్ ఛైర్మెన్ బి.పార్థసారధి, జేవిఆర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


N.B.K.R.
INSTITUTE OF SCIENCE & TECHNOLOGY
(AUTONOMOUS)
Affiliated to JNTUA, Anantapuramu,
Re-Accredited by NAAC (UGC) with 'A' Grade
VIDYANAGAR-524 413, SPSR Nellore Dt., A.P.
Estd : 1979
www.nbkrist.org, email: ist@nbkrist.org, Phone : (08624) 228247

CONGRATULATIONS
FOR ACHIEVING "A" GRADE

The Management congratulates the Teaching, Non-Teaching Staff and Students for their efforts in achieving **"A" Grade** in the grading list of Engineering Colleges released by Government of Andhra Pradesh.

B.Tech. Courses offered :
- **Mechanical** (Accredited by NBA thrice)
- **Civil** (Accredited by NBA thrice)
- **EEE** (Accredited by NBA thrice)
- **ECE** (Accredited by NBA thrice)
- **CSE** (Accredited by NBA thrice)

ONLY INSTITUTE IN THE DISTRICT
- With all B.Tech. Courses accredited by NBA thrice
- Re-Accredited by NAAC (UGC) with "A" Grade.

FIRST INSTITUTE IN THE DISTRICT
WITH AUTONOMOUS STATUS



Nedurumalli Ram Kumar
CORRESPONDENT

## 'ప్రభా'తం

# కాంగ్రెస్ కలలు కల్లలేనా?

బీహార్ ఎన్నికల ఫలితాలతో భారత రాజకీయ స్వరూపమే మారిపోతుందని, ఈ రాష్ట్ర ఫలితాలు ఒక అద్భుతమని, మహాకూటమి ప్రయోగాలు దేశమంతటా విజయవంతమవుతాయని రాజకీయ విశ్లేషకులు పెద్దపెద్ద వ్యాసాలు వ్రాస్తున్నారు. చర్చా వేదికలపై ఘంటాపథంగా చెబుతున్నారు. బీహార్‌లో బీజేపీ ఓటమిని ప్రధాని నరేంద్రమోడీ ఓటమిగా చిత్రించి చూపుతున్నారు. నిజమే, బీహార్‌లో నరేంద్ర మోడీని ఎక్కువగా చూపారు, ఆయన కూడా ఎక్కువగా మాట్లాడారు. దానికి చేదు ఫలితాలనే వాళ్లు చవిచూడాల్సి వచ్చింది.

బీహార్ ఫలితాలలో గెలిచిందెవరు? ఓడిపోయిందెవరు? గతంలో బీజేపీ మిత్రపక్షంగా వుండింది. ఇప్పుడు ప్రతిపక్షంలో వుంది. నితీష్ పేరును వాడుకోకుండా తమ ఓటు బ్యాంకును సొంతంగా తెచ్చుకున్నారు. ఇది వారి పరిస్థితి. మరి నితీష్ పరిస్థితేంటి? దళ్(యు) కంటే ఆర్జేడీకి ఎక్కువ సీట్లు వచ్చాయి. అంటే లాలూ ఇమేజ్‌తో ఆయన గెలిచినట్లా? ఈరోజు నితీష్ విజయమిదని లాలూ చెప్పొచ్చు. రాజకీయాల్లో ఒకే మాట ఎల్లకాలం వుండదు. లాలూ పక్కా రాజకీయనాయకుడు. ఇప్పటికే ఒక కొడుకుని ఉపముఖ్యమంత్రి స్థానంలో, ఇంకో కొడుకును మంత్రి స్థానంలో పెట్టాడు. నితీష్‌కు ఈ ప్రశాంతత కొద్ది రోజులే! లాలూ మూలంగా ఆయనకు చుక్కలు కనిపించేరోజులు దగ్గరలోనే వున్నాయి. బీజేపీతో వుండుంటే నితీష్‌కు ఏరోజూ ఈ పరిస్థితిలొచ్చేవి కావు. ఇక బీహార్‌లో కాంగ్రెస్ మరుగుజ్జే. అది ఏదో ఒక పార్టీ నీడలో ఎదగాల్సిందే! బీహార్ ఫలితాలను చూసి కాంగ్రెస్ నాయకులు సంబర పడుతున్నారు. ఫలితాలలో బీజేపీకి పోటీగా కాదు, కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఒక రాజకీయ కేంద్రం పుట్టుకొస్తుందని వారు గ్రహించలేకపోతున్నారు. కేవలం ఒక్క రాష్ట్రం ఫలితాలతోనే భారత దేశంలో రాజకీయాలు తలక్రిందులు కావు. ప్రభుత్వాలు కూలవు. పరిస్థితులు మారవు. దేశంలో మూడో కూటమి బలపడుతుందంటే ఓ పక్క కాంగ్రెస్ బలహీనపడుతుందని అర్థం. ఒకప్పుడు బీహార్‌లో కాంగ్రెస్ వుండేది. ఆ తర్వాత జనతాదళ్, ఆర్జేడీ, దళ్(యు)లు వచ్చాయి. వాటి మధ్యలో బీజేపీ కూడా వచ్చి, ఇప్పుడు గట్టి ప్రతిపక్షంగా వుంది. కాంగ్రెస్ నాలుగోస్థానంలో వుంది.

1989కు ముందు దేశంలో పరిస్థితేంటి? కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా జాతీయ, ప్రాంతీయ పార్టీలన్నీ ఒకటయ్యేవి. అంటే ఆరోజుకు దేశంలో కాంగ్రెస్ గట్టిగా వుందనే! ఎక్కువ రాష్ట్రాల్లో ఏ పార్టీ అయితే అధికారంలో లేదా ప్రతిపక్షంలోనైనా ఉండగలిగితే జాతీయ స్థాయిలోనూ ఆ పార్టీ బలంగా వుండగలదు. ఒకప్పుడు కాంగ్రెస్‌పార్టీ దేశంలోని అన్ని రాష్ట్రాలలో బలంగా వుండేది. కాని ఆయా రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం పెరిగేకొద్ది కాంగ్రెస్ కనుమరుగు కాసాగింది. ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాల్లో కాంగ్రెస్ మరుగుజ్జుగా మారింది. మధ్యప్రదేశ్, హర్యానా, ఒరిస్సా, రాజస్థాన్, కేరళ, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో ప్రతిపక్షానికి పరిమితమైంది. ఈశాన్య రాష్ట్రాల్లో కొంత బలంగా వున్నప్పటికి జాతీయ రాజకీయాలలో నిలదొక్కుకోవడానికి ఆ రాష్ట్రాల బలం చాలదు. ఏ పార్టీ అయినా గట్టిగా నిలబడాలంటే అధికారంలోనన్నా లేక ప్రతిపక్షంగానైనా పోరాడుతుండాలి. కాంగ్రెస్ ఆ పని చేయడం లేదు. ఎక్కడికక్కడ ప్రాంతీయ పార్టీలతో కలుస్తూ వాటి ప్రాబల్యానికి లోబడి తన ప్రాధాన్యతను కోల్పోతోంది.

అదే సమయంలో గెలిచినా, ఓడినా బీజేపీ ఆయా రాష్ట్రాలకు పాకుతోంది. కొత్త రాష్ట్రాలలో ప్రాధాన్యతను పెంచుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఎన్ని ఎక్కువ రాష్ట్రాలకు విస్తరించగలిగితే జాతీయ స్థాయిలో అంత బలంగా ఉండొచ్చన్నది ఆ పార్టీ వ్యూహం.

ఈరోజు దేశంలో బీజేపీ బలపడిందనేదానికి ఒకే ఉదాహరణ. పాతికేళ్ల క్రితం దేశంలోని ప్రాంతీయ జాతీయ పార్టీలన్నీ కూడా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా కూటమి కట్టేవి. ఇప్పుడు కాంగ్రెస్‌తో సహా జాతీయ, ప్రాంతీయపార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా కూటమి కడుతున్నాయి. కాంగ్రెస్‌కు ఎంత గడ్డు కాలమొచ్చిందనేదానికి ఇదో ఉదాహరణ.

ఈమధ్య కాలంలో మహాకూటమి బాగా పాపులర్ అవుతోంది. ఇక అన్ని రాష్ట్రాల ఎన్నికలలోనూ, రాబోయే పార్లమెంటు ఎన్నికలలోనూ ఇదే ఫార్ములాను ప్రయోగించే అవకాశాలున్నాయి. అయితే కూటమిలోని కలయికలే చిత్రవిచిత్రంగా ఉంటున్నాయి. నిజాయితీకి నిలువుటద్దమైన నితీష్‌కుమార్ మొన్న అవినీతికి ప్రతిరూపమైన లాలూతో కలిసి ఎన్నికల ప్రచారం చేయాల్సి వచ్చింది. లాలూతో కలిసి నితీష్ ఎక్కడైనా అవినీతి కుంభకోణాల మీద విమర్శలు చేయగలడా? అసలు వాటి పేరెత్తగలడా? నితీష్‌కుమార్ ప్రమాణస్వీకారోత్సవంలో అవినీతి లాలూను ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ కౌగిలించుకున్నాడు. వ్యక్తుల మధ్య ఆలింగనాలను ఎవరూ ఆక్షేపించరు. కాని అరవింద్, లాలూలు కలిసి రాజకీయంగా పనిచేస్తే ప్రజలు ఆదరిస్తారా? ఇక పదేళ్ల దేశాన్ని అవినీతి కూపంగా మార్చి లక్షలాది కోట్ల కుంభకోణాలకు కారణమైన కాంగ్రెస్‌పార్టీతో కలిసి ఈ మహాకూటమి పార్టీలన్నీ బీజేపీతో పోరాటం చేయాలనుకుంటున్నాయి. కేవలం మతతత్వమనే ముద్రవేసి బీజేపీతో పోరాడుతున్న ఈ పార్టీలకు కాంగ్రెస్ అవినీతి కంపు మాత్రం ఇంపుగా ఉన్నట్లుంది. ఒక దిశా నిర్దేశం లేని పార్టీలు కూటములు కడితే వాటివల్ల ఒరిగేది తరిగేదీ ఏమీ లేదు.

కాంగ్రెస్ కూడా ఈ మహాకూటమి తోటలో ఓ మొక్కలా వుండబోతోంది. ఏ రాష్ట్రంలో ప్రాంతీయపార్టీ బలపడినా అక్కడ కాంగ్రెస్ కనుమరుగవుతున్నట్లే లెక్క! రాహుల్‌ను ప్రధానిగా చూడాలనుకున్న సోనియా కలలకు కాలం చెల్లినట్లేనని ప్రస్తుత రాజకీయ పరిణామాలు చాటిచెబుతున్నాయి.

1989కు ముందు దేశంలో పరిస్థితేంటి? కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా జాతీయ ప్రాంతీయ పార్టీలన్నీ ఒకటయ్యేవి. అంటే ఆరోజుకు దేశంలో కాంగ్రెస్ గట్టిగా వుందనే! ఎక్కువ రాష్ట్రాల్లో ఏ పార్టీ అయితే అధికారంలో లేదా ప్రతిపక్షంలోనైనా ఉండగలిగితే జాతీయ స్థాయిలోనూ ఆ పార్టీ బలంగా వుండగలదు. ఒకప్పుడు కాంగ్రెస్‌పార్టీ దేశంలోని అన్ని రాష్ట్రాలలో బలంగా వుండేది. కాని ఆయా రాష్ట్రాలలో ప్రాంతీయపార్టీల ప్రాబల్యం పెరిగేకొద్ది కాంగ్రెస్ కనుమరుగు కాసాగింది.



# ప్రభుత్వం దృష్టికి నష్టం అంచనాలు

------------ **మునిసిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వల్లవన్**

నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ కడపజిల్లాల్లో కురిసిన భారీ వర్షాల ధాటికి ఆయా మునిసిపాలిటీల పరిధిలో జరిగిన నష్టాన్ని అంచనా వేసి, ఆ అంచనాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని మునిసిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ కరికాల వల్లవన్ తెలిపారు. ఈ నెల 20న ఆయన సూళ్ళూరుపేట పట్టణానికి విచ్చేసి, ఇక్కడ వర్షబాధితులను పరామర్శించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నెర్రికాలువ లైనింగ్ పనులు జరిగేందుకు తనవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పరసా రత్నం, జడ్పీటిసి సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, పట్టణ పరిధిలో నెర్రికాలువపై చిన్నపాటి బ్రిడ్జిలు నిర్మించాలని, చెంగాళమ్మ ఆలయం సమీపంలో శిథిలావస్థకు చేరుకున్న వంతెన స్థానంలో పెద్ద వంతెన నిర్మించాలని సూచించారు. ఇప్పటికే మంచినీటి సమస్య పరిష్కారం కోసం రూ.185 కోట్లతో రెండవ ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపివున్నామని, ఆ ప్రతిపాదనలను వెంటనే మంజూరు చేయించాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో ఛైర్ పర్సన్ ఎన్ విజయలక్ష్మి, వైస్ ఛైర్మెన్ జి. ఈశ్వరమ్మ, కమిషనర్ ఎల్. చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి నాయకులు వేనాటి పరంధామిరెడ్డి, కౌన్సిల్ సభ్యులు మురళి, పి. కాటయ్య, బాబు, రాజా తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాకు వెయ్యికోట్లు విడుదల చేయాలి

## - వెంకయ్యకు బిజెపి నాయకుల వినతి

భారీ వర్షాలతో అపారంగా నష్టపోయిన జిల్లాకు కేంద్ర ప్రభుత్వం తక్షణ సాయంగా వెయ్యికోట్ల రూపాయలను విడుదల చేయాలని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడుకు జిల్లా బిజెపి నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 21న కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు నెల్లూరుకు విచ్చేసిన సందర్భంగా, బిజెపి నాయకులు ఆయన్ను కలిసి జిల్లా పరిస్థితులను వివరించారు. పిడబ్ల్యుడి అధికారుల నిర్లక్ష్యం వల్ల రహదారులు వరదప్రవాహానికి దెబ్బతిన్నాయని, కాలువల్లో పూడికతీత పనులు చేపట్టివుంటే ఇంతగా నష్టం జరిగివుండేది కాదని వారు కేంద్రమంత్రి వెంకయ్యకు వివరించారు. నెల్లూరు నగరంలో కాలువలను ఆక్రమించి అక్రమ కట్టడాలు నిర్మించడం వల్ల అనేకప్రాంతాలు ఈ భారీవర్షాలకు, వరదనీటి ముంపునకు గురయ్యాయని వారు తెలిపారు. భారీ వర్షాల ధాటికి పంటలు మునిగి రైతాంగం కంటతడిపెడుతున్నారని, ఆక్వా రైతులు, వరి రైతులు, అన్ని రకాల పంటలు వేసుకున్న రైతులు పంటలు మునిగిపోవడంతో తీవ్ర నిరాశలో వున్నారని వారు వెంకయ్య నాయుడికి తెలియజేశారు. ఈ పరిస్థితుల్లో కేంద్రప్రభుత్వం బాధితులను ఆదుకోవాలని వారు కోరారు. అనంతరం వారు ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సురేంద్ర రెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, సిహెచ్ రమణయ్యనాయుడు, బండారు శ్రీనివాసులు, కుడుముల సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అందరికీ 10కేజీల బియ్యం ఇవ్వాలి

రేషన్‌కార్డుతో సంబంధం లేకుండా అందరికీ పదికేజీల బియ్యం ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి కోరారు. సోమవారం నెల్లూరుజిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ గత 50ఏళ్లలో ఇలాంటి ఉపద్రవం ఎన్నడూ చూడలేదన్నారు. ఆక్రమణలు తొలగించే సమయంలో కొందరు అడ్డుపడుతున్నారన్నారు. జన్మభూమి కమిటీలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసులు, నరశింహులునాయుడు, కామేశ్వరమ్మ, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# హిందువులకు మనోభావాలుండవా?

హిందూ సంస్కృతిని విమర్శిస్తే దేశంలో లౌకికభావం వున్నట్లనే భావన అతివాదుల్లో పెరిగిపోతోంది. ఈమధ్య అసహనం అనే కొత్త పదాన్ని కనిపెట్టారు. ఎవరి మీద ఎవరికి అసహనం. మెజార్టీ ప్రజల మనోభావాలను గుర్తించకుండా ఏదో ఒకటి లాగి వారిని బాధపెట్టే వ్యక్తులది అసహనం కాదా? సరస్వతీ దేవి బొమ్మను నగ్నంగా గీసిన ఎం.ఎఫ్.హుస్సేన్‌లో అసహనం లేదుగాని ఆయనను బెదిరించిన వారిలో అసహనం వుందంటారు? హిందువులు ఆరాధించే దేవుళ్లను నీచంగా తిడితే తప్పులేదు గాని, వారి మీద కోపం చూపిస్తే అసహనమా? హిందూ సంస్కృతి మీద దాడి చేస్తున్న వాళ్లు అదే పనిని ముస్లిం, క్రైస్తవ మతాల మీద చేయగలరా? హిందువులు సహనశీలురు కాబట్టే ఈ దేశంలో అన్ని మతాలు సమంగా ఆదరించబడుతున్నాయి. మూర్ఖులైన మేధావుల్లారా... ఈ విషయాన్ని అర్థం చేసుకోండి.

**సి.రాజీవి, నెల్లూరు.**

# ఆక్రమణలు తొలగించండి

ఈ భారీ వర్షాలకు నెల్లూరు నగరమే మునిగిపోయింది. పలు కాలనీలు ఇంకా నీట్లో వున్నాయి. వీటన్నింటికి కారణం వరద కాలువలను ఆక్రమించి నీళ్లు పోయే దారిలేకుండా చేయడమే! కాలువల స్థలాలను ఆక్రమించి హోటళ్లు, భవనాలు, వాణిజ్య సముదాయాలు కట్టారు. కాలువల్లో పోవాల్సిన నీళ్లు దారిలేక కాలనీలను ముంచాయి. ఈ కాలువల ఆక్రమణలను ఇకనైనా తొలగించండి.

**పి.ప్రసాద్, నెల్లూరు.**

# కేంద్ర పెన్షనర్ల సమాచారం




ఇటీవల కేంద్ర ప్రభుత్వ సిబ్బంది శాఖ, కేంద్ర ప్రభుత్వ శాఖలు, కేంద్ర ప్రభుత్వ పబ్లిక్ రంగ సంస్థల నుండి రిటైర్ అయిన ఉద్యోగులు తాము ఎన్‌జిఓ, మత ప్రచార సంస్థలతో సహా ప్రైవేటు వ్యాపార సంస్థల్లో పాల్గొనలేదని, పాల్గొనటం లేదని ప్రభుత్వానికి తెలియజేయాల్సివుంది. ఒకవేళ ప్రభుత్వం ఆక్షేపిస్తే పెన్షనర్లు తమ ప్రైవేటు ఉద్యోగాలను ఉపసంహరించుకుంటామని ప్రకటన చేయాలి. ఈ పరిస్థితి ఉత్పన్నం కావడానికి కారణం కొన్ని ఎన్జీఓ సంస్థలు, ఎఫ్‌సిఆర్‌ఏ నిబంధనల మేరకు అంతర్జాతీయ నిధులను దేశ వ్యతిరేక కార్యకలాపాలకు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు రావడమే! కనుక కేంద్రప్రభుత్వ పెన్షనర్లు ఈ సమాచారాన్ని ఖచ్చితంగా ఇవ్వాలి.

**ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.**

# ఉపయోగపడ్డ చంద్రబాబు రాక!

***2014ఎన్నికల తర్వాత నెల్లూరుజిల్లా మీద చంద్రబాబు చాలా పగ పెంచు కున్నాడు. ఈ జిల్లాకు ఏమీ చేయకూడదని, ఎటువంటి అభివృద్ధి పనులు మంజూరు చేయకూడదని పంతం పట్టాడు. నెల్లూరు జిల్లాను, ఈ జిల్లా నాయకులను చాలా చిన్నచూపు చూసాడు. దీనికంతటికీ కారణం ఆ ఎన్నికల్లో టీడీపీ ఈ జిల్లా నుండి కేవలం 3అసెంబ్లీ సీట్లు గెలవడమే!***







సాధారణంగా ఏ పాలకుడు కూడా ఎన్నికలయ్యాక ప్రాంతాల పట్ల వివక్ష చూపడు. చూపితే సొంత జిల్లా, ప్రాంతాల పట్ల కాస్తా ఎక్కువ శ్రద్ధ చూపుతాడు. కాని చంద్రబాబు ఎందుకో ఆరోజు నెల్లూరుజిల్లాపై తన అక్కసును ఆపుకో లేకపోయాడు.

అయితే ఆగ్రహం ఎల్లకాలం ఉండదు. కొంత కాలానికి ఆగ్రహం పోయి పాజిటివ్‌గా ఆలోచించే తత్వమొస్తుంది. ఈమధ్య కాలంలోనే నెల్లూరుజిల్లా పట్ల చంద్రబాబు వైఖరిలో కొంత మార్పు వచ్చింది. ఈ జిల్లా పట్ల సానుకూలంగా ఆలోచించ సాగాడు. తాజాగా వచ్చిన వర్షాలు, వరదలు నెల్లూరుతో ఆయనకు ఇంకొంత సంబంధాన్ని పెంచాయి. జిల్లాను వరదలు ముంచెత్తిన నేపథ్యంలో మూడురోజులు చంద్రబాబు నెల్లూరులోనే మకాం వేశారు. సహాయక చర్యల విషయంలో అధికారులను పరుగులు తీయించారు. జిల్లాలో దెబ్బతిన్న పంటలను, రహదారులను, ఇళ్లను ఆయన పరిశీలించి బాధితులను పరామర్శించడం జరిగింది. మనుబోలు వద్ద తెగిన జాతీయ రహదారిని పరిశీలించడంతో పాటు సోమశిల, సర్వేపల్లి రిజర్వాయర్‌లను స్వయంగా పరిశీలించారు. రహదారుల పునరుద్ధరణ, మరమ్మత్తులపై ఆర్ అండ్ బి అధికారులను పనులిచ్చి తరిమారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించి సహాయక చర్యలపై పరుగులు తీయించారు. భారీ వర్షాలు, వరదలు వస్తే వచ్చాయి గాని వీటి మూలంగా నెల్లూరు నగరానికి ఓ మంచి పని జరగబోతోంది. నగరంలో వరదలకు కొన్ని ప్రాంతాలు మునిగిపోవడానికి పంట కాలువల ఆక్రమణలే ప్రధాన కారణమని చంద్రబాబు స్వయంగా గ్రహించారు. ఈ ఆక్రమణల తొలగింపుకు వెంటనే శ్రీకారం చుట్టి అధికారులను రంగంలోకి దింపారు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక నెల్లూరు నగరానికి జరుగుతున్న తొలి మంచి పని ఇదే!

## కేంద్రప్రభుత్వం ఆదుకుంటుంది

### కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు



రాష్ట్రంలో భారీవర్షాలు, వరదలతో వున్న ప్రాంతాల్లో బాధితులను ఆదుకునేందుకు కేంద్రం సిద్ధంగా వుందని, అదేవిధంగా రాష్ట్రంలో వరద నష్టాలను పరిశీలించి కేంద్రప్రభుత్వం ఆ నష్టాలనుంచి రాష్ట్రాన్ని ఆదుకుంటుందని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. మనుబోలు మండల పరిధిలో వరదలతో కోతకు గురైన జాతీయ రహదారి పునరుద్ధరణ పనులను ఆయన ఈ నెల 21న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వరద నష్టాలపై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నివేదికను కేంద్ర బృందం అధ్యయనం చేస్తుందన్నారు. వారిచ్చే నివేదిక ఆధారంగా కేంద్రం తగు సాయం అందిస్తుందన్నారు. ప్రకృతి విపత్తులను దృష్టిలో పెట్టుకుని జాతీయ రహదారిపై మరిన్ని వంతెనలు ఏర్పాటుచేయాలని సూచించారు. ఈ విషయమై కేంద్రమంత్రి గడ్కరీతో మాట్లాడతామన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రవాణాశాఖ, హైవే అధికారులు సమన్వయంతో పనిచేస్తూ వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తూ, మరోవైపు రోడ్లు బాగుచేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిజెపి నాయకులు ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి, మురళి, కందుకూరు సత్యం, బి.శ్రీనివాసులు తదితరులున్నారు.

## ఆక్రమణలతోనే ఈ అరిష్టమంతా!

### - ఎమ్మెల్సీ సోమిరెడ్డి



నెల్లూరు నగరంలో కాలువల ఆక్రమణల వల్ల అనేక ప్రాంతాలు నీటి ముంపునకు గురయ్యాయని, ఈ పరిస్థితుల్లో పార్టీలకు అతీతంగా ఆక్రమణలను వెంటనే తొలగించాలని, అందుకు అందరూ కృషి చేయాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈ నెల 20న నగరంలోని మన్సూర్ నగర్, పరమేశ్వరినగర్‌లలో వరద నీటి ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. బోట్‌లో తిరుగుతూ ఆయా ప్రాంతాల్లోని ప్రజలను కలుసుకుని వారి కష్టాలను విన్నారు. నగరంలో 13 సాగునీటి కాలువలు వున్నాయని, అయితే సుమారు 50-60 అడుగులు వుండాల్సిన ఆ కాలువలు ఆక్రమణల వల్ల నాలుగడుగులకు కుదించుకుపోయాయని, అందువల్ల చిన్న వర్షం వచ్చినా నీళ్లు వెళ్ళే మార్గాలు సక్రమంగా లేక లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయని ఆయన అన్నారు. కాలువలపై ఈ ఆక్రమణలను తొలగించేందుకు 2004లోనే టిడిపి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని, అయితే ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఆక్రమణలను తొలగించకపోవడంతో ముంపు తప్పడం లేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇకనైనా, పార్టీలకు అతీతంగా ఆక్రమణల తొలగింపునకు అన్ని పార్టీల వారు సహకరించాలని ఆయన కోరారు. కాలువలపై ఆక్రమణలు తొలగించి అర్హులైనవారికి డ్యూప్లెక్స్ ఇళ్ళను కట్టించి ఇస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రూరల్ కన్వీనర్ కిలారి వెంకటస్వామినాయుడు, జిల్లా టిడిపి అధికారప్రతినిధి డాక్టర్ జడ్ శివప్రసాద్, నాయకులు అన్నం దయాకర్‌గౌడ్, ఖాదర్‌బాషా, తిరుమలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆక్వా వల్లే అధిక నష్టం



భారీ వర్షాల దెబ్బకు జిల్లాలో భారీగానే నష్టం సంభవించింది. అయితే కురిసిన వర్షాలతో పోలిస్తే జరిగిన నష్టం తక్కువేననుకోవచ్చు. అదే గనుక ఈ వానకు గాలి తోడై వుంటే నష్టం అంచనాలకు అందివుండేది కాదు. భారీ వర్షాలపుడు చెరువులు తెగడం సహజమే. అయితే తెలంగాణలో మిషన్ కాకతీయ పేరుతో చెరువులను బాగుచేసినట్లు ఇక్కడ కూడా వర్షాలకు ముందే చెరువులకు మరమ్మత్తులు చేసివుంటే ఇన్ని చెరువులు తెగే పని ఉండేది కాదు. పుష్కరాలకు, పట్టిసీమకు పెట్టిన నిధులతో రాష్ట్రంలో అన్ని చెరువులనూ బాగుచేసి ఉండొచ్చు. రెండుచోట్ల జాతీయ రహదారి తెగడం, కొన్నిచోట్ల రోడ్లు దెబ్బతినడంతో కొంత నష్టం జరిగింది. భారీవర్షాలు, వరదలప్పుడు ఈ నష్టం తప్పదు. ఇక ఇళ్లు కూలిపోవడం, దెబ్బ తినడం వంటి నష్టాలు తక్కువే! గాలి లేకపోవడం చాలావరకు కాపాడింది.

అక్టోబర్ నెల చివరిదాకా వర్షాలు లేవు. సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లలో నీళ్లు లేవు. ఇక వర్షాలు వస్తాయనే నమ్మకం లేక ఆయకట్టు క్రింద చాలావరకు నారుమళ్లు వేయలేదు. ఈ వర్షాలకు నారుమళ్లు గనుక పెద్ద విస్తీర్ణంలో వేసుంటే నష్టం భారీగానే వుండేది. పంటల నష్టం చాలావరకు తగ్గినట్లే!

అసలైన నష్టం ఆక్వాలోనే! ఇది వాణిజ్య సాగు. దాదాపు 2వేల హెక్టార్లలో ఆక్వాసాగు దెబ్బతింది. భారీవర్షాలకు కోట, వాకాడు, చిల్లకూరు, ముత్తుకూరు, ఇందుకూరుపేట, విడవలూరు మండలాలలో రొయ్యలగుంటలు తెగిపోయాయి. కోట్లాది రూపాయల సరకు సముద్రం పాలుకాగా, కొందరు గిరిజనులు సముద్రం పాలవుతున్న రొయ్యలను వలలతో పట్టుకుని కిలోను 50 నుండి 100రూపాయలకే అమ్ముకున్నారు. చాలాచోట్ల చేతికొచ్చిన దశలో రొయ్యల గుంటలు తెగిపోయాయి. ఒక ఎకరాలో నారుమళ్లు పాడైతే నష్టం పదివేలుంటుందేమో! ఒక ఎకరా రొయ్యల గుంట పోతే నష్టం 10లక్షల దాకా వుంటుంది. రొయ్యల గుంటలు తెగడం మూలంగా ఒక్క ఆక్వా పరంగానే వెయ్యికోట్ల దాకా నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది.

## వరద బాధితులకు చేయూతనిస్తాం

### ఆదాల ప్రభాకర్‌రెడ్డి



జిల్లాలో భారీవర్షాలకు తీవ్రంగా నష్టపోయిన బాధితులను అన్నివిధాలా ప్రభుత్వం ఆదుకుంటుందని నెల్లూరు పార్లమెంటరీ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకరరెడ్డి అన్నారు. నెల్లూరు గ్రామీణ మండలంలోని సౌత్‌మోపూరు గ్రామంలో ఈ నెల 21న ఆయన వరద బాధితులను పరామర్శించి బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వర్షాలకు అస్తవ్యస్తమైన చేనేత కుటుంబాలవారికి రూ. 10 వేలు, 50 కేజీల బియ్యం తదితర సరుకులు అందించారు. బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎంతగానో కృషి చేస్తున్నారని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆదాల వెంట విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, టిడిపి నాయకులు కిలారి వెంకటస్వామినాయుడు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, నెల్లూరు ఏఎంసి ఉపాధ్యక్షుడు రాంగోపాల్, వేమిరెడ్డి అశోక్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు కౌసల్యమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆదాల ములుముడి, సజ్జాపురం, కొమ్మరపూడి, దేవరపాళెం గ్రామాల్లో బాధితులకు నిత్యావసర సరుకులు అందజేశారు.

ఆధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# దడదడలాడించిన చంద్రబాబు



అభివృద్ధి కార్యక్రమాల కోసం సీఎం చంద్రబాబు ఈ నెల 21న నెల్లూరు వచ్చి వుండాలి. ఆయనైతే వచ్చాడు గాని సభలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల కోసం కాదు. వరద భీభత్సాన్ని చూడడానికి ఆయన రావాల్సి వచ్చింది. ఈ నెల 20, 21, 22వ తేదీలలో ఆయన జిల్లాలో పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో వరద పరిస్థితులను, బాధితులకు అందుతున్న సహాయక చర్యలను పరిశీలించారు. సిఎం నెల్లూరులో వున్నంత వరకు అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి.

## నెల్లూరు కబుర్లు

# తుఫాను బాధితులకు 'కిషోర్స్ రత్నం' చేయూత



తుఫాను వల్ల నష్టపోయి ఇప్పటికీ కోలుకోలేని బాధితులను చూసి చెలించిన డా॥ కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ అధినేతలు డా॥ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్‌లు వారిని ఆదుకున్నారు. నెల్లూరులోని ఇరుకళలమ్మ గుడి ప్రాంతం, కోనేటిమిట్ట, రాజీవ్ గృహకల్ప, శివగిరి కాలని తదితర ప్రాంతాల్లో వరదనీటిలో చిక్కుకుని వున్న రెండువేల మంది బాధితులకు పులిహోర, వెజిటెబుల్ రైస్, వాటర్ ప్యాకెట్లను రెండుపూటలా అందించారు. ఆహార పొట్లాలను అందజేసిన డా॥ కిషోర్స్ రత్నం జెన్‌నెక్స్ట్ స్కూల్స్ జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ విపత్తులు సంభవించినపుడు బాధితులను ఆదుకోవడం మన కర్తవ్యమన్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు నేటికీ దిక్కుతోచని స్థితిలో వున్నారని, ఈ విధంగా ఆహార పొట్లాలతో ఆదుకోవడం వల్ల వారికి కాసింత మనోధైర్యాన్నిచ్చిన వారవుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ రాజేష్, స్కూలు సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మక అవార్డు




నెల్లూరులోని సింహపురి హాస్పిటల్స్ అత్యవసర విభాగ అధిపతి డాక్టర్ శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మక అవార్డు లభించింది. సొసైటీ ఫర్ ఎమర్జెన్సీ మెడిసిన్-ఇండియా వారు ఈ అవార్డును ఆయనకు బహుకరించారు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 21న జరిగిన సమావేశంలో సెమీ బోర్డు ఈ అవార్డును అందజేసింది. రాష్ట్రస్థాయిలో ఈ అవార్డుకు డాక్టర్ శ్రీనివాస్ ఎంపిక కావడం విశేషం. డాక్టర్ శ్రీనివాస్ గత ఏడాదిన సింహపురి హాస్పిటల్స్ అత్యవసర వైద్య విభాగాన్ని ప్రారంభించారు. ఇప్పటికి దాదాపు 10వేల మందికి పైగానే రోగులకు అత్యవసర విభాగం, ఎంఐసియు ద్వారా సేవలందించారు. ఈ అవార్డు ఆయనకు లభించిన సందర్భంగా సింహపురి హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, వైద్యులు, సిబ్బంది అందరూ డాక్టర్ శ్రీనివాస్‌ను అభినందించారు. అనతికాలంలో రోగులకు మంచి వైద్యసేవలందిస్తూ అందరి ప్రశంసలూ, ఉన్నత స్థాయి అవార్డులను అందుకుంటున్న డాక్టర్ శ్రీనివాస్‌కు 'లాయర్' అభినందనలు.

# కవితల పోటీకి ఆహ్వానం

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కవితల పోటీని నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు చిన్ని నారాయణరావు తెలిపారు. ఏదైనా సామాజికాంశం నేపథ్యంగా కవితల పోటీలో ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. డిసెంబర్ 10లోగా కవితల్ని ఈతకోట సుబ్బారావు, కార్యదర్శి, నెం.24-1697, 2వ వీధి, రవీంద్రనగర్, నెల్లూరు-4 చిరునామాకు పంపాలన్నారు. డిసెంబర్ 13న జరిగే ప్రత్యేక కవి సమ్మేళనం కార్యక్రమంలో ప్రముఖులచే బహుమతి ప్రదానం జరుగుతుందని, నెల్లూరు టౌన్‌హాల్‌లో జరిగే ఈ కవి సమ్మేళనంలో "వైద్య వ్యాపారం"పై కవితలు వినిపించాల్సి ఉంటుందని, విద్యార్థులు, కవులు, రచయితలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# రేషన్ షాపుల వద్ద రద్దీ

నెల్లూరులోని చౌకదుకాణాలన్నీ వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో కార్డుదారులందరికీ 25కిలోల బియ్యం, కందిపప్పు, చక్కెర, పామాయిల్ పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆదివారం రాత్రికి నగరంలోని అన్ని రేషన్ షాపులకు సరుకులొచ్చాయి. సోమవారం నుండి అన్ని షాపుల వద్ద వినియోగదారులు సరుకులు తీసుకుంటున్నారు.

# జాతీయ లోక్ అదాలత్

జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల ప్రకారం డిసెంబర్ 12న జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ కనకదుర్గారావు తెలిపారు. రాజీ చేయదగిన అన్ని సివిల్, క్రిమినల్ కేసులతో పాటుగా కుటుంబ వివాదాలు, బ్యాంకు కేసులు, ప్రమాదాల కేసులను ఈ లోక్‌అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా వున్న కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

# మండిన ధరలు

వర్షాలు, వరదలకు జాతీయ రహదారి మీద దాదాపు నాలుగు రోజుల పాటు వాహనాలు నిలిచిపోవడం తెలిసిందే! దీంతో ఇతర జిల్లాల నుండి నెల్లూరుకు వచ్చే కూరగాయల రవాణా ఆగిపోయింది. బయట ప్రాంతాల నుండి సరుకు రాకపోవడంతో ఏసి కూరగాయల మార్కెట్‌లో కూరగాయల ధరలకు రెక్కలు మొలిచాయి. టమోటా అంతకు ముందే చుక్కలు చూపించసాగింది. ఎప్పుడూ కిలో 10రూపాయలుగా వుండే దొండ, బెండకాయలు కిలో 40రూపాయలయ్యాయి. ఏ కాయగూరల ధర కూడా కిలో 40రూపాయలకు తగ్గలేదు.

# నేత్రదానం





ఈ నెల 23వ తేదీన అల్లూరు మండలం ఇస్కపల్లి గ్రామ నివాసి వేమూరి రామారావు(82) నెల్లూరు, సుబేదారుపేట నివాసి తన్నీరు సుబ్బరాయుడు(83)లు మరణించారు. వారి కుటుంబసభ్యుల కోరిక మేరకు లయన్స్ క్లబ్ నెల్లూరు వారి ఆధ్వర్యంలో మాడరన్ ఐ హాస్పిటల్ వారు వారి నేత్రాలను సేకరించారు. తాము కను మూసినా తమ కళ్లతో మరో ఇద్దరికి చూపును ప్రసాదించారు.

# రిమాండ్ ఖైదీ మృతి

ప్రకాశం జిల్లాకు చెందిన చిన చెంచు రామయ్య(50) ఓ హత్య కేసులో ఏడేళ్ళ నుంచి నెల్లూరుజిల్లా కేంద్ర కారాగారంలో జీవితఖైదు అనుభవిస్తున్నాడు. అనారోగ్యం కారణంగా గత కొంతకాలంగా ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాడు. నెల రోజుల క్రితం చికిత్స నిమిత్తం తిరుపతి సిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు.

# బైక్‌పై మంత్రుల హల్‌చల్!



వర్షాలు, వరదల పుణ్యమా అని మున్సిపల్ మంత్రి పి.నారాయణకు నెల్లూరు నగరంలో ఎక్కువ రోజులు గడిపే అవకాశమొచ్చింది. వరదలు కూడా ఆయన కోసమే వచ్చినట్లున్నాయి. వరద బాధితులకు సాయం అందించడంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శిద్దా రాఘవరావుతో కలిసి ఆయన బాగానే కష్టపడుతున్నారు. మంగళవారం మంత్రులిద్దరూ మన్సూర్‌నగర్, మనుమసిద్దినగర్ ప్రాంతంలో బైక్‌పై రౌండ్లు కొడుతూ వరద సాయం పనులను పరిశీలించడం ఆకర్షణగా నిలిచింది.

# అక్రమాలకు పాల్పడితే సస్పెండ్

**- రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి సునీత**



వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం, నిత్యావసర సరకుల పంపిణీలో రేషన్ షాపు డీలర్లు అక్రమాలకు పాల్పడితే వెంటనే సస్పెండ్ చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి పరిటాల సునీత హెచ్చరించారు. ఆదివారం నెల్లూరు వేదాయపాలెంలోని ఎస్‌డబ్ల్యుసి, అల్లీపురంలోని విఆర్‌ఆర్ గోడౌన్లను పరిశీలించారు. అన్ని రేషన్‌షాపులకు నిత్యావసర సరుకులను సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. బియ్యం, కందిపప్పు, పామాయిల్, చక్కెర పక్కదారి పట్టకుండా బాధితులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈపాస్ విధానం ద్వారా అక్రమాలకు చాలావరకు అడ్డుకట్ట పడిందన్నారు. తక్షణ సాయం క్రింద జిల్లాలో 3.20లక్షల కుటుంబాలకు, 4వేల చేనేత కుటుంబాలకు సరుకులు అందిస్తున్నామన్నారు. తొలుత మంత్రి పౌరసరఫరాల శాఖ కమిషనర్ జయలక్ష్మి, జిల్లా కలెక్టర్ జానకి, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ తదితరులతో సమీక్షించారు.

# అపోలోలో న్యూరాలజీ జాతీయ సదస్సు




నెల్లూరు అపోలో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో పెరల్స్ ఇన్ క్లినికల్ న్యూరాలజీపై జాతీయస్థాయి సదస్సు జరిగింది. ఆదివారం న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ నరాల సమస్యలపై జరుగుతున్న చర్చలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రొఫెసర్లు పాల్గొనడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా కోర్సులకు సంబంధించిన బుక్‌లెట్లను ఆవిష్కరించారు. ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కోర్సుకు సంబంధించిన పూర్తి వివరాలను www.facebook.com/apolloneurosciences.nellore వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో బెంగుళూరు నుంచి డాక్టర్ పి.సతీష్‌చంద్ర, న్యూఢిల్లీ నుంచి ఎం.ఎం.మెహంది, విశాఖపట్నం నుంచి డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, చెన్నై నుంచి టి.లక్ష్మినరసింహన్‌లతో పాటు అపోలో ఆసుపత్రి యూనిట్‌హెడ్ డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

# 'జైన్ యూత్'కు సిఎం అభినందనలు

నెల్లూరులో వరద ప్రాంతాల్లో బాధితులను ఆదుకునేందుకు జైన్ యూత్ సభ్యులు చేస్తున్న కృషి, వారి సహాయక చర్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెచ్చుకున్నారు. ఈ నెల 21వ తేది రాత్రి ముఖ్యమంత్రి వరదబాధిత ప్రాంతాల పరిశీలనకు వచ్చినప్పుడు అక్కడున్న జైన్‌యూత్ సభ్యులు చేపడుతున్న సహాయక కార్యక్రమాలను చూసి వారిని అభినందించారు. వరదప్రాంతాల్లోని బాధితులకు, షెల్టర్ జోన్‌లలోని నిరాశ్రయులకు కూడా జైన్‌యూత్‌వారు తమవంతు సాయంగా భోజనం, మంచినీరు, పాలు, పండ్లు, దుప్పట్లు వగైరాలను అందజేశారు. శివగిరికాలనీలో పర్యటించిన ముఖ్యమంత్రి చేతుల మీదుగా జైన్‌యూత్ సభ్యులు బాధితులకు ఆహార పొట్లాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జైన్‌యూత్ సభ్యులు అశ్విన్‌జైన్, జిగ్నేష్, రంజిత్, భారత్, హితేష్, దిలీప్, విక్రమ్‌జైన్, కిరణ్ తదితరులున్నారు.

# మన నిర్లక్ష్యమే... మనకు శాపమైంది!

## ➢ 'లాయర్' ముందుగా హెచ్చరించినా పట్టించుకోని యంత్రాంగం


లాయర్ నెల్లూరు, శుక్రవారం, అక్టోబర్ 02, 2015

మెట్టకు ఊపిరొచ్చింది!

మొన్నటి వానల విజృంభణ ప్రజలను నానా యాతనలకు గురిచేసింది. నెల్లూరు నగరంలోని ప్రధాన వీధుల్లో సైతం జల ప్రళయం వచ్చిందా అన్నంతగా, ఇటీవలి కాలంలో ఎన్నడూ కనీవినీ ఎరుగునంతగా వానలతో వచ్చిన వరదనీటి ప్రవాహం తన విశ్వరూపాన్ని చూపింది. అయితే, ఇలాంటి విపత్తు నవంబర్, డిసెంబర్ నెలలో రానే వస్తాయని, గత అనుభవాల దృష్ట్యా అధికారయంత్రాంగం ముందుగానే అప్రమత్తం కావాలని 'లాయర్' ముందుగానే హెచ్చరించినా ఎవరూ పట్టించుకోకపోవడం దారుణం. కాలువలకు మరమ్మత్తులు, పూడిక తీయడాలు, గుర్రపుడెక్క తొలగించడాలు, చెరువు గట్లు, ముఖ్యంగా పెన్నానదీ పరీవాహక ప్రాంతాల్లో అప్రమత్తంగా వుండడం ఇలాంటివన్నీ అధికారుల జాబితాల్లో వున్నా, వానలు నిలువునా ముంచేదాకా ఎవరూ పట్టించుకోలేదు. జనం అవస్తలను జనానికే వదిలేసి యంత్రాంగం నిర్లక్ష్యంగా వుండడం, చివరి క్షణంలో పరుగులు తీసివారూ ఏమీ చేయలేక అవస్తలు పడడం విచారకరం. 'లాయర్' అక్టోబర్ 2వ తేది సంచికలో 2వ పేజీలో 'మెట్టకు ఊపిరొచ్చింది' అనే శీర్షికతో ఇచ్చిన వార్తలో, నవంబర్–డిశెంబర్ నెలల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా వుండాలని సూచించడం జరిగింది. ఆ వార్తలో ఉటంకించిన భాగాన్ని మళ్ళీ మీ దృష్టికి తెస్తున్నాం.

*"నెల్లూరు నగరంలో సాయంత్రం వేళల్లో, రాత్రి వేళల్లో ఒక్కసారిగా వాతావరణమంతా చల్లబడి, ఉరుములు మెరుపులతో జోరువాన కురిసింది. శనివారం రాత్రి (సెప్టెంబర్ 31) దాదాపు గంటకు పైగానే కురిసిన కుండపోత వానతో నేల చల్లబడింది. మళ్ళీ ఉదయానికల్లా ఎండలు మామూలే. ఏదేమైనా అప్పుడప్పుడూ కురుస్తున్న ఈ జల్లులు, వర్షాకాలానికి అంకురార్పణ చేసినట్లున్నాయి. మంచిదే. దీన్నిబట్టి చూస్తే నవంబర్, డిసెంబర్ నెలల్లో కూడా వర్షాలు బాగానే కురవవచ్చని వూహించవచ్చు. జిల్లాలో సహజంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో మంచి వానలు కురుస్తుంటాయి. అందువల్ల ముఖ్యంగా ఈ రెండు నెలలు బాగా అప్రమత్తంగా వుండాల్సిన సమయం. ప్రకృతి ఎప్పుడు అనుగ్రహిస్తుందో.. ఎప్పుడు ఆగ్రహిస్తుందో ఎలా చెప్పగలం?.. ఒక్కోసారి ఈ వానలే ఉన్నట్లుండి మరీ అధికమైపోయి, కొద్ది గంటల్లోనే ఏ వరదగానో.. తుఫాన్‌గానో మారిపోయే అవకాశాలు కూడా లేకపోలేదు. జిల్లాలో గత అనుభవాలరీత్యా ఈ రెండు నెలలు జాగ్రత్తగా వుండడం అవసరం. ఒకప్పట్లో నెల్లూరు జిల్లాను గజగజ వణికించి, మృత్యుఘంటికలు మోగించిన 'పెద్ద గాలివాన' ఒక ప్రభంజనంగా వచ్చి విలయతాండవం చేసింది కూడా నవంబరులోనే. ఆ తర్వాత కాలంలోనూ పలుసార్లు వానలు పెను భీభత్సం సృష్టించింది కూడా ఎక్కువగా ఈ రెండు నెలల్లోనే. ప్రకృతి ఉపద్రవాలు ఎప్పుడు ఎలా విరుచుకుపడుతాయో చెప్పలేం కదా?..ఏదేమైనా ఇప్పటినుంచి ముందుజాగ్రత్తగా వుండడం ఎంతైనా శ్రేయస్కరం".*

ఇంత స్పష్టంగా హెచ్చరించినా, అటు నెల్లూరులో కానీ.. జిల్లా వ్యాప్తంగా కానీ అధికారులు ముందు జాగ్రత్తలేమీ తీసుకోకపోవడాన్ని ఏమనుకోవాలి?.. నెల్లూరు రోడ్లు వరద కాలువలై పొంగి ప్రవహించడం, ప్రజలు ట్రంకురోడ్డు నుంచి దర్గామిట్టకు, ఇటు వైపు మాగుంట లేఅవుట్ ప్రాంతం నుంచి ట్రంకురోడ్డుకు కూడా వెళ్ళలేని దయనీయ స్థితిని ఏమని వర్ణించగలం?.. వచ్చే విపత్తులను మనం ఆపలేకపోయినా, జనావాస ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా చేతనైనంత సాయం చేయడం మానవత్వం. కాలువ కట్టలను, చెరువు కట్టలను, నదీపరీవాహక ప్రాంతాలు మునకకు గురికాకుండా కట్టుదిట్టంగా తీసుకోవాల్సిన చర్యలను ముందుగానే చేపట్టివుంటే, నెల్లూరు నగరంలోకి వరద నీటి ప్రవా హాలు వచ్చి వుండేవి కావు. వాహనాలు రాకపోకలకు ఇంతగా అంతరాయం వుండేది కాదు. ఏదేమైనా, ఇప్పటికైనా అధికార యంత్రాంగం కదిలి, జిల్లా వ్యాప్తంగా ఈ మండలానికి ఆ మండలం, ఏ గ్రామానికి ఆ గ్రామానికి సంబంధించిన అధికారులు, సిబ్బంది బృందాలుగా వెళ్ళి చెరువు కట్టలను పరిశీలించి, వాటిని పటిష్టం చేయడానికి ఎక్కడ ఎలాంటి అవసరం వుందో ప్రత్యక్షంగా చూసి తగు చర్యలు తీసుకోవడం తక్షణ అవసరం. డిసెంబర్ నెల పూర్తయ్యేదాకా సాగర తీరంలో వున్న ఈ జిల్లా ఎలాంటి విపత్తులకూ గురికాకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా వుంది. అధికార యంత్రాంగం అప్రమత్తంగా వుంటూ, ప్రజలను కూడా అప్రమత్తం చేయాల్సిన ఈ తరుణంలో, వానలు వస్తుంటాయి పోతుంటాయి మనమేం చేయగలం?.. అనే నిర్లక్ష్యపు ధోరణి విడనాడి, వానలు మరింత ఉధృ తంగా మారి తుఫాన్ వంటి ఉపద్రవాలు మరింతగా పెరిగిపోకముందే తీరప్రాం తాల్లో ప్రజల రక్షణకు, భద్రతకు తీసు కోవాల్సిన చర్యలను సమీక్షించి తగు చర్యలు తీసుకోవడం అవసరం. అంతా అయిపోయాక, ఏ మేరకు పంటలు మునిగిపోయాయో, ఎక్కడెక్కడ ఎంత నష్టం వాటిల్లిందో అనే అంచనాలు వేస్తూ కాలయాపన చేయడం ఎంతమాత్రం భావ్యం కాదు. ప్రజలు కష్టాల బారిన పడకుండా ఎంతో అప్రమత్తంగా వుంటూ, ముందు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదే. ఈ రెండు నెలల్లో ఎవరెప్పుడు నిర్లక్ష్యం వహించినా, అత్యధిక మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని చెప్పవలసిరావడం బాధాకరమే అయినా, రానున్న విపత్తులను ఎవరమూ స్పష్టంగా వూహించలేం కనుక, గత అనుభవాల దృష్ట్యా మరింతగా అప్రమత్తంగా వుండాల్సిన తరుణం ఇదే. అటు అధికార యంత్రాంగమే కాక, ప్రజలు కూడా ఎవరికి వారు అప్రమత్తంగా వుండి, ప్రకృతి విపత్తులనుంచి సురక్షితంగా బయటపడేందుకు తగు ముందుజాగ్రత్తలతో వుండడం ఎంతైనా శ్రేయస్కరం. అధికార యంత్రాంగం ఇకనైనా అలక్ష్యం వీడాలి. డిసెంబర్ నెలాఖరుదాకా ఎంతో అప్రమత్తంగా వుంటూ జిల్లాను ప్రకృతి భీభత్సాల బారి నుంచి కాపాడాలి. ఇప్పటికే వరదల బారిన పడి కష్టనష్టాలకు గురైనవారిని తక్షణం ఆదుకోవాలి.

## సతీష్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్




నెల్లూరీయుడు, భారత రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారుడు డాక్టర్ గంర్ర సతీష్‌రెడ్డికి కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఇటీవల విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ యూనివర్శిటీ ఉపకులపతి ప్రొఫెసర్ వివిఎస్ కుమార్ ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో విశ్వవిద్యాలయాలకు కొరత లేదని, కొత్త పరిశోధనలు, సరికొత్త సాంకేతిక నైపుణ్యత సముపార్జనపై విద్యార్థులు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. దేశ రక్షణ రంగంలో మరిన్ని మార్పులకు, అత్యాధునిక సాంకేతిక ప్రగతికి పరిశోధనలు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ రిజిస్ట్రార్ జి.వి.ప్రసాద్‌రాజు కూడా పాల్గొన్నారు.

## పేరంటాలమ్మకు ఆనం పూజలు



నెల్లూరురూరల్ మండలం సౌత్‌రాజుపాలెంలోని పేరంటాలమ్మ ఆలయంలో మంగళవారం నుంచి శాంతి పూజలు నిర్వహిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే, పీసీసీ ఉపాధ్యక్షులు ఆనం వివేకానందరెడ్డి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. స్వర్గీయ ఏసి సుబ్బారెడ్డి సతీమణి అన్నపూర్ణమ్మ వున్నంతకాలం ఈ శాంతిపూజలు జరిగేవి. ఆమె తర్వాత ఆ వంశీయులెవరూ ఆ దేవతకు పూజలు నిర్వహించలేదు. ఇటీవల ఆ ఊరులో ఒకరికి పేరంటాలమ్మ పూని తనకు పూజలు, పండుగలు మూడురోజుల పాటు నిర్వహించాలని, ఆనం వివేకానందరెడ్డే వీటిని జరిపించాలని చెప్పిందని ఈ సందర్భంగా వివేకా పేర్కొనడం గమనార్హం. గ్రామాన్ని చల్లగా చూడాలని ప్రార్థిస్తూ ఆనం కుటుంబీకులు మూడురోజుల పాటు కలశస్థాపన, అగ్ని గుండం, పట్టాభిషేకం, పొంగళ్లు నిర్వహించారు. అమ్మవారు తన చేత పూజలు చేయించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు వివేకా పేర్కొన్నారు. ఈ పూజల్లో ఆనం సతీమణి హైమావతి, స్థానిక కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి, ఆనం కుటుంబసభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## వాహన సిబ్బందిని ఆదుకున్న శ్రీసిటీ



భారీ వరదలకు మనుబోలు సమీపంలో జాతీయ రహదారికి గండి పడి వేలాది వాహనాలు హైవే మీద నిలిచిపోవడం తెలిసిందే. చెన్నై నుండి నెల్లూరు వైపు వెళ్లే వాహనాలను పోలీసులు ఎక్కడికక్కడ ఆపివేయడం జరిగింది. తడ సమీపంలోని శ్రీసిటీ యాజమాన్యం ఈ ఆపత్కాలంలో తమ ఆపన్న హస్తం అందించింది. హైవే మీద ట్రాఫిక్ ఇబ్బందులేర్పడకుండా శ్రీసిటీ ప్రధాన రహదారిపై 500 వాహనాలను నిలపడానికి చొరవ తీసుకుంది. శ్రీసిటీ భద్రతాధికారి అల్తాఫ్ పర్యవేక్షణలో వాహనాలలోని సిబ్బందికి ఆహారాన్ని, మంచినీళ్లను అందించారు.

## మాడరన్ స్కూల్లో కార్తీక దీపోత్సవం



బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నెల్లూరు సరస్వతీనగర్‌లోని మాడరన్ స్కూల్లో కార్తీక దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అన్ని తరగతుల విద్యార్థులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'నేస్తం' ఆపన్నహస్తం



నెల్లూరు నగరంలో వరద ముంపుకు గురైన ప్రాంతాల్లో నేస్తం ఫౌండేషన్ వారు తమ వాహనం ద్వారా దాదాపు 2వేల మందికి బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. పెనుబోలు సునీల్‌కుమార్‌రెడ్డి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కోరం ప్రవీణ్ కుమార్, సభ్యులు వెంకటేశ్వరరావు, విక్రం, శివ, చైతన్య, వెంకట్, నవీన్, పెంచలస్వామి, సతీష్ పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## పోలీసు సేవలు భేష్

### - అదనపు డీజీపీ ఆర్పీ ఠాగూర్



జిల్లాలో వరద ప్రాంతాల్లో ప్రజలను కాపాడటంలో పోలీసులు చొరవ చూపారని శాంతి భద్రతల అదనపు డీజీపీ ఆర్పీ ఠాగూర్ తెలిపారు. గూడూరు డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన డీఎస్పీ బి.శ్రీనివాస్‌తో కలిసి విలేకర్ల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో కురిసిన భారీవర్షాలకు పలు చోట్ల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 10అడుగుల మేర వరద నీటిలో బాధితులను సాహసోపేతంగా పోలీసులు కాపాడారని తెలిపారు. గూడూరు, నెల్లూరు, నాయుడుపేట, వెంకటగిరి తదితర ప్రాంతాల్లో దాదాపు 4వేల మంది వరద బాధితులను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారని చెప్పారు. ఇదే స్ఫూర్తితోనే పోలీసులు ప్రజలకు సేవలు విస్తృతంగా అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా నిలుస్తాం!



బాధితులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పొనకా దేవసేన, కౌన్సిలర్లు

గూడూరు ప్రాంతాల్లో విస్తారంగా కురిసిన భారీవర్షాలకు సోమవారం వేకువ జామున పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో గూడూరు పట్టణంలోని నర్సింగరావుపేట, బిసి కాలనీ, సున్నపుబట్టీ వీధి, బనిగిసాహెబ్ పేట, శ్రామికనగర్, వేములపాళెం, మధురెడ్డికాలనీ, గిరిజన కాలనీ తదితర ప్రాంతాల్లో మూడు అడుగుల మేర ఎగువ ప్రాంతం నుంచి వరద చుట్టుముట్టింది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లోని ప్రజలందరూ తీవ్ర భయాందోళనలు చెందారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పొనకా దేవసేన, తెలుగుదేశంపార్టీ నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి, పలువురు కౌన్సిలర్లు ముంపుకు గురైన ప్రాంతంలో విస్తృతంగా పర్యటించి ప్రజలను ఓదార్చారు. త్వరలోనే డ్రైనేజీ వ్యవస్థను బాగుచేస్తామన్నారు. వరదనీటిలోని వేములపాళెం, మధురెడ్డి కాలనీ, గిరిజన కాలనీ ప్రజలకు పలువురు దాతలు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఇంకా మధురెడ్డి కాలనీలో వరద ప్రవాహం ఉండటంతో అగ్ని మాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి కొందరిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గూడూరు మండలంలోని తిప్పవరప్పాడులో కైవల్యానదిలో గల్లంతైన వ్యక్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టేలా తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జ్యోత్స్నలత సమీక్షించారు. అగ్నిమాపక అధికారులతో చర్చించి ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలని చెప్పారు.

## నెల్‌క్యాస్ట్ కార్తీక వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న నెల్‌క్యాస్ట్ సిబ్బంది

గూడూరు నెల్‌క్యాస్ట్ మేనేజ్‌మెంట్ వారి సిబ్బంది ఆ ప్రాంత ప్రజలతో కలిసి 500 చెట్లు ఇండస్ట్రియల్ ఏరియాలో నాటారు. ఈ సందర్భంగా నెల్‌క్యాస్ట్ జనరల్ మేనేజర్ అడ్మినిస్ట్రేషన్ ఎన్.ఎస్.రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్‌క్యాస్ట్ మేనేజర్(పి.ఆర్) ఆనిమెళ్ళ శివకుమార్, జనరల్ మేనేజర్లు పి.కోటిరెడ్డి, దువ్వూరు మునిచంద్రయ్య, కె.సి.బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసరావు, సెక్యూరిటీ మేనేజర్ పి.రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## డా॥ సిఆర్ రెడ్డి ఆసుపత్రి వారి దాతృత్వం

గూడూరు డా॥ సిఆర్ రెడ్డి హాస్పిటల్ వారి తరపున డా॥ సి.జనార్థన్‌రెడ్డి, డా॥ సి.రోహిణి గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షానికి పూలతోట గిరిజన కాలనీ, అంబేద్కర్ నగర్, చిల్లకూరు శేషమ్మ స్కూల్లో వున్న 1700 మంది బాధితులకు ఆహార ప్యాకెట్లు అందజేసి తమ దాతృత్వం చాటుకున్నారు. మహిళా మండలి సభ్యులు వీరికి సహకారం అందించారు.

## ఘనంగా సత్యనారాయణ వ్రతాలు

గూడూరు పట్టణంలోని జీఎన్ రాయులు కళ్యాణ మండపంలో ఆదివారం వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటి ఆధ్వర్యంలో కనులపండువగా సత్యనారాయణస్వామి వ్రతాన్ని నిర్వహించారు. వరదల ముంపు నుంచి పట్టణాన్ని కాపాడాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ వ్రతాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు ఆర్యవైశ్య ప్రతినిధులు తెలిపారు. అలాగే పెల్లేటి వారివీధిలోనూ ఆదివారం నాడు స్థానికులు సత్యనారాయణ స్వామి వ్రతాన్ని చేశారు.

## యుద్ధప్రాతిపదికన రోడ్ల మరమ్మత్తులు



వరద ప్రాంతాల్లో పరిశీలిస్తున్న రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యాంబాబు

భారీ వర్షాల ధాటికి మూడు జిల్లాల్లో దాదాపు 1500కి.మీ దూరం రోడ్లు దెబ్బతిన్నట్టు ప్రాథమిక నివేదిక అందిందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్యాంబాబు తెలిపారు. గూడూరు మండలం తిప్పవరప్పాడులో ఆదివారం భారీవర్షాలకు పొంగిన కైవల్యానది వరదను ఆయన పరిశీలించారు. గూడూరు – రాజంపేట, గూడూరు – వెంకటగిరి మార్గాల్లో దెబ్బతిన్న రోడ్లను చూసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాల్లో 1500కి.మీ. దూరం రోడ్లు ధ్వంసం కావడంతో రూ.60కోట్ల మేర నష్టం వాటిల్లిందని, వాటిని యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయిస్తున్నామన్నారు. వరదల వల్ల దెబ్బతిన్న రోడ్లను రూ.500కోట్లతో పూర్తి స్థాయిలో నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. గూడూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎల్ఎస్ బాలాజీరావు కూడా పర్యటించారు. మరో ప్రత్యేకాధికారి రవీందర్ పౌరసరఫరాల గోదాములో వుండి డివిజన్‌లోని అన్ని ప్రాంతాలకు లారీల్లో నిత్యావసర సరుకులను పంపే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# శ్రీకాళహస్తి న్యూస్

## అసాధ్యాలను సుసాధ్యం చేయడమే అధికారుల లక్ష్యం

### -శ్రీకాళహస్తిలో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం



అధికారులు సమయపాలన, సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే ఎంతటి క్లిష్ట సమస్యనైనా వెంటనే పరిష్కరించుకోవచ్చని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు హితవు పలికారు. భారీ వర్షాలకు ముఖ్యమంత్రి మూడు రోజులు నెల్లూరు జిల్లాలో పర్యటించిన అనంతరం ఆదివారం రాత్రి చిత్తూరు జిల్లా శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఉన్న వైష్ణవి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశం, పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసాధ్యాలను సుసాధ్యం చేయడమే అధికారులు లక్ష్యంగా పెట్టుకుని చేస్తే అసాధ్యం కానిది ఏదీ లేదన్నారు. అధికారుల తీరు మారాలన్నారు. అధికారులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మన రాష్ట్రంలో చాలా జిల్లాల్లో వ్యవసాయమే ఆధారంగా జీవించే వారున్నారన్నారు. వ్యవసాయానికి సాగునీరందించడమే "పంట సంజీవని" లక్ష్యంగా భావించాలన్నారు. నవ్యాంధ్ర రాష్ట్రాన్ని కరువు రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి "పంట సంజీవని పథకాన్ని" రూపకల్పన చేస్తున్నట్లు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో 15 రోజులుగా భారీ వర్షాలకు అతలాకుతలమైన పంట పొలాలపై అధికారులు తీవ్రంగా కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుమారు రెండు గంటలపాటు అన్ని శాఖాధికారులతో సమీక్షించారు. పది సంవత్సరాల తర్వాత చిత్తూరు జిల్లాతో పాటు రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వర్షాలు అన్నదాతలకు, పాలకులకు ఆనందంతోపాటు అసంతృప్తిని, నష్టాలను కూడా మిగిల్చిందన్నారు. చిత్తూరు జిల్లాలోని ఇరిగేషన్ అధికారులపై తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. పది టియంసిల నీరు చిత్తూరు జిల్లా నుండి సముద్రం పాలుకావడంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రణాళికలు, జాగ్రత్తలు లేకపోవడం వలనే ఈవిధంగా జరిగిందన్నారు. కొన్ని సంవత్సరాలుగా అతివృష్టి, అనావృష్టి అన్నదాతలను అతలాకుతలం చేసిందన్నారు. వారిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. అన్నదాతలు కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామన్నారు. గత సంవత్సరం రైతులకు రుణమాఫీ చేశామని, రాష్ట్రంలో ఏ ఒక్క ఎకరా పంటను కూడా ఎండనివ్వనని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకుంటామన్నారు. రెయిన్‌గన్ పథకాన్ని పైలెట్ ప్రాజెక్టుగా రబీసీజన్‌లో అమలు చేస్తామన్నారు. కరువుకు అవకాశం లేకుండా నీటిని సద్వినియోగం చేసుకొని ముందుకు పోవాలని వ్యవసాయాధికారులకు వివరించారు. భూగర్భ జలాలను కాపాడుకోవడానికి అవకాశం వున్న దగ్గర చెక్‌డ్యాం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోనే చిత్తూరు జిల్లా భూగర్భ జలాల్లో వెనుకబడిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, శాసనసభ్యులు సుగుణమ్మ( తిరుపతి ), తలారి ఆదిత్య(సత్యవేడు ), చిత్తూరు జిల్లా కలెక్టర్ సిద్దార్థజైన్, జాయింట్ కలెక్టర్ నారాయణ్ భరత్ గుప్తా, ఎం.ఎల్.సి. గౌరినేని శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, ఆర్డీవో వీరబ్రహ్మయ్య, తహ శీల్దార్ చంద్రమోహన్, డిప్యూటీ తహశీల్దార్ మునిరత్నం, శ్రీకాళహస్తి మున్సిపల్ చైర్మన్ పేట రాధారెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పోతుగుంట గురవయ్యనాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గల్పిక

# చంద్రబాబు తపస్సుకు మెచ్చిన వరుణుడు

అక్టోబర్ నెల 26వ తేదీ... హైటెక్‌రత్న, ఆంధ్రా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కూర్చుని అమరావతి రాజధానిని ఇంకా అద్భుతంగా నిర్మించేందుకు ఏఏ దేశాలు తిరగాలా అని ఆలోచిస్తూ ప్రపంచ పటం ముందేసుకుని చూస్తున్నాడు. నైట్‌రైడర్, ముదురదోమల మంత్రి పి.నారాయణ ఆ మ్యాప్‌లో కొత్త దేశాలను గుర్తిస్తూ ఒక పేపర్ మీద వ్రాసుకుంటున్నాడు. అప్పుడే నీళ్ల పారుదల మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అక్కడకు వచ్చాడు. ఆయన ముఖంలో బాధ గోడకు కొట్టిన పిడకలా స్పష్టంగా కనిపిస్తోంది. ఆవలిస్తే లోపల పేగులనే కాదు నరాలు, ఎముకలను కూడా లెక్కపెట్టే చంద్రబాబు దేవినేని ఉమలో కనిపిస్తున్న బాధను టక్కున పసిగట్టి... ఏం అలా వున్నావని అడిగాడు. ఉమ బాధను బిగపట్టి... ఏం చెప్ప మంటారు సార్, నేను దారిలో వస్తుండగా ఒక నీచుడు, త్రుచ్ఛ మానవుడు... ఈ చంద్రబాబు వస్తేనే ఇంతే, ఎండలు మండిపోతాయి, కరువు వస్తుంది, వానలే రావు అని అన్నాడు. అంతేనా... ఆ వై.యస్. వున్నప్పుడు వద్దన్నా వర్షాలే... అని పొగిడాడు. ఈ మాటలను నా మనసు జీర్ణించుకోలేకపోతోంది సార్... అని విల పించసాగాడు. దేవినేని ఉమలోని బాస్ భక్తికి చంద్రబాబు ముగ్ధ డయ్యాడు. దేవినేని ఉమ చెప్పిన మాటలు చంద్రబాబులోనూ ఆలోచనలు రేకెత్తించసాగాయి. అవును వై.యస్. వున్నప్పుడు వర్షాలు రావడమేంటి... నేను పరిపాలనలోకి వస్తే చిత్తకార్తెలోనూ చిర్రెత్తు కొచ్చే ఎండలు కాయడమేండి... ప్రకృతికి ఈ పక్షపాతమేంటి... అని అనుకుంటూ వెంటనే కంబాలధీర అనే అఘోరాను హిమా లయాల నుండి పిలిపించాడు. అఘోరా చంద్రబాబు చేయిలోని రేఖలు చూస్తూ కళ్లు మూసుకున్నాడు. చంద్రబాబు గత జన్మంతా ఆయన కళ్ల ముందు 'బాహుబలి' సినిమాలా తిరిగింది. అఘోరా కళ్లు తెరచి... చంద్రబాబూ.. నీ పాలనలో వర్షాలు పడడం లేదంటే అది గత జన్మ పాప ఫలితమే. గత జన్మలో నువ్వు చంద్రగిరి యువరాజువు. ఓ రోజు అడవికి వేటకు వెళ్లగా అక్కడ వ్యాహాళికి వచ్చిన మైసూరు యువరాణి 'మిత్రబృంద' ప్రేమలో పడ్డావు. ఒకరోజు మీరిద్దరూ అడవిలో కలుసుకోవాలని ఆ రోజుల్లో ఇంటర్నెట్, సెల్‌ఫోన్లు లేవు కాబట్టి పావురాల ద్వారా సమాచారం పంపుకున్నారు. కరెక్ట్‌గా మీరు కలుసుకోవాలనుకున్న రోజు చంద్రగిరి రాజ్యంలో భారీ వర్షంతో వరదలు వచ్చాయి. మీరు చెప్పిన చోటుకు వెళ్ల లేకపోయారు. మిత్రబృంద మాత్రం మీ కోసం మీరు చెప్పిన ప్రాంతానికి వచ్చి ఎదురుచూసి చూసి విసుగెత్తి ప్రేమ మీదే మోహం మొత్తి వెళ్లిపోయింది. ఆ తర్వాత ఆమె మీకు కనిపించలేదు. మీ ప్రేమ భగ్నం కావడానికి వర్షమే కారణమని భావించిన మీరు వరుణ దేవునిని బండబూతులు తిట్టారు. అందుకు కోపించిన ఆయన ఇక మీరు ఎక్కడుంటే అక్కడ వర్షాలు పడనీయ కూడదని నిర్ణయించాడు. ఇదంతా మీ గత జన్మ వైపరీత్యమే. ఏమన్నా గుర్తొ స్తుందా అని అఘోరా అడిగాడు. నాకు మొన్న ఇచ్చిన హామీలే గుర్తుండవు, ఇక గత జన్మ ఎక్కడ గుర్తొస్తుంది స్వామీ, ముందు తరుణోపాయం చెప్పండని చంద్రబాబు అడిగాడు. ఇంకేముంది తపస్సు చేసి ఆ వానదేవుడిని ప్రసన్నం చేసుకోవడమే అని అఘోరా సెలవిచ్చాడు.

★★★★★

రవాణాకు అనువుగా వుంటుందని, వాతావరణం బాగుంటుం దని మదనపల్లి హార్సిలీహిల్స్‌లో చంద్రబాబు తపస్సు చేయడం మొదలుపెట్టాడు. ఆయన నోటితో ఏదో పదాలు పలుకుతున్నాడు. 'ఓం' అనే పదం తప్ప ఇంకేం అర్థం కావడం లేదు. చంద్రబాబు తపస్సు చూసి శివుడు, విష్ణుమూర్తి, బ్రహ్మ, ఇంద్రుడు, వాయు, అగ్ని, వరుణ దేవుళ్లంతా ఒక్కచోట చేరారు. విష్ణుమూర్తి వుండి... ఆ చంద్రబాబు ఎవరి గురించో తపస్సు చేస్తున్నాడో, ఎవరి గురిం చైంది క్లారిటీ లేదు. అతని మాటలు అర్థం కాకున్నవి, ఈమధ్య అతను 'అమరావతి' రాజధాని కడుతున్నాడు. బహుశా స్వర్గలోక రాజధాని కూడా అమరావతియే కదా! కాబట్టి దేవేంద్రుడి సహకా రానికై తపస్సు చేస్తుండొచ్చు, దేవేంద్రా... నువ్వెళ్లు అని అన్నాడు. అందుకు ఇంద్రుడు... స్వామీ, మన గైడ్‌లైన్స్ ప్రకారం ముందు అతనికి ప్రిలిమినరీ టెస్ట్ పెట్టాలి, అందుకని తపస్సు భగ్నానికి రంభ, మేనక, ఊర్వశిలను పంపుతాను అంటుండగా పక్కనే వున్న నారదుడు... దేవేంద్ర, ఊర్వశి ఆయాసంతోనూ, మేనక నడుం నొప్పితోను బాధపడుతూ సెలవులో వున్నారు. రంభ ఒక్కటే డ్యూటీలో వుంది అని చెప్పాడు. సరే రంభనే భూలోకానికి వెళ్లమని చెప్పు అని తన పిఏను ఆదేశించాడు.

రంభ చంద్రబాబు ముందు దిగింది. తన వెంట తెచ్చుకున్న టేప్‌రికార్డర్ ఆన్ చేసింది. 'నరుడా ఓ నరుడా ఏమి కోరికా' అనే 'భైరవద్వీపం' సినిమాలోని పాటకు డ్యాన్స్ చేయసాగింది. చంద్ర బాబు ఒక కన్నును లైట్‌గా తెరచి ఆమె డ్యాన్సంతా చూసాడు. పాట అయిపోగానే లైట్‌గా తెరచిన కన్నును కూడా పూర్తిగా మూసేసి 'ఓం వరుణదేవాయనమః' అని పఠించసాగాడు. రంభ అతనితో... ఓ నరుడా నీ తపస్సుకు మెచ్చితిని, నన్ను ఏలుకో నా రాజా... అని అంది. చంద్రబాబు కళ్లు తెరచి... నేను ఇరవై ఐదులో కాదు, అరవై ఐదులో ఉన్నాను, నాక్కావాల్సింది మీరు కాదు ఆ వరుణదేవుడు అని చెప్పాడు. అప్పుడు రంభ... నీ నిగ్రహశక్తికి మెచ్చితిని, నువ్వు ఎవరి గురించి తపస్సు చేస్తున్నావో తెలియక పైన మా దేవతలంతా కన్ఫ్యూ జన్‌లో ఉన్నారు. నేను ఇప్పుడే వెళ్లి ఆ వరుణదేవుడికి సమాచారాన్ని చేరవేసెదను అంటూ మాయమైంది.

★★★★★

రంభ ఇచ్చిన ఇన్ఫర్మేషన్ ప్రకారం దేవతలంతా కలసి వరుణ దేవుడిని చంద్రబాబు వద్దకు పంపారు. వరుణదేవుడు తన ముందు దిగిన దృశ్యాన్ని తన మనోనేత్రంతో గుర్తించిన చంద్రబాబు 'ఓం వరుణదేవాయానమః' అనే మంత్రాన్ని ఇంకా గట్టిగా పలకసాగాడు. వరుణదేవుడు వుండి... నాయనా చంద్రబాబు, తపస్సు ఇక చాలించు... నీ బాధేంటో చెప్పు అని అడిగాడు. గత జన్మలో నేను చేసిన పొరపాటుకు ఈ జన్మలో నన్ను శిక్షించడం అన్యాయం కదా స్వామి, నావల్లే వర్షాలు కురవడం లేదని ఈ ప్రజలంతా నన్ను తిట్టుకుంటున్నారు. కాబట్టి నా అకౌంట్‌లో ఎంత బ్యాలెన్స్ వర్షముందో అంత వర్షాన్ని కురిపించు అని అడిగాడు. దానికి వరుణుడు... నాయనా, వారంరోజుల తిండి ఒకేరోజు తినగలమా... ఇన్ని సంవత్సరాల నీ బ్యాలెన్స్ వర్షాన్నంతా ఒకేసారి కురిపిస్తే బాగుండదేమో ఒకసారి ఆలోచించు అని అన్నాడు. దానికి బాబు... నేను ఒకసారి ఆలోచిస్తే వందసార్లు ఆలోచించినట్లే... రెండో మాటలేదన్నాడు. నీఖర్మ, తథాస్తంటూ వాన దేవుడు మాయమయ్యాడు.

★★★★★

ఫలితం... చంద్రబాబు తపస్సు, వరుణదేవుడి కరుణ మూలంగా గతంలో చంద్రబాబు సీఎంగా చేసిన కాలంలోనూ, ఈ రెండేళ్లలోనూ కురవాల్సిన బ్యాలెన్స్ వర్షమంతా ఈ నెలలో కురిసింది. వూర్లకు వూర్లు మునిగిపోయాయి. మొన్నటిదాకా వానలు లేక నష్టం... ఇప్పుడు వానలెక్కువై కష్టం.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి. అనుకున్న పనులు సవ్యంగా జరుగుతాయి. అవసరానికి డబ్బు సర్దుబాటు అవుతూ, ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. పరిస్థితు లకు అనుకూలంగా సర్దుకొనిపోవలసి వస్తుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. వృత్తి వ్యాపారాలకు సామాన్య వృద్ధి, ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

శుభకార్య ప్రయత్నాలు అనుకూలించగలవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. ఆర్థికాభివృద్ధికై మీరు చేసే కృషికి ప్రతిబంధకాలుంటాయి. వృత్తి పరంగా ఆదాయం బాగుంటుంది. వ్యాపారవర్గాలకు అవకాశాలు తప్పిపోవచ్చును. శుభవార్తలు వింటారు. నిరుద్యోగులకు అవకాశాలు లభించగలవు. పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. క్రయవిక్రయాలలో తొందరపడవద్దు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

యజమానులకు వర్కర్లతో ఇబ్బందులు రావచ్చును. ఉద్యోగార్థులకు అవకాశాలు లభించగలవు. ముఖ్య పత్రాలు, నగదు విషయాలలో జాగ్రత్తగా ఉండండి. ముఖ్య విషయాలలో అవగాహన పెరిగి ఇతరులపై పట్టు సాధించగలరు. అనుకున్న పనులకు అవకాశాలు కలిసి వచ్చి జరుగుతాయి. వృత్తివ్యాపారాలు అభివృద్ధికరంగా ఉండి ఆదాయం పెరుగుతుంది.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

రావలసిన బాకీలు కొంతమేరకు చేతికందడం, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. ఆహ్వానాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అనుకూలంగా జరుగుతాయి. వ్యాపారవృత్తి జీవనంలో పెరుగుదల బాగుండి ఆదాయం పెరుగుతుంది. శుభకార్య, ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత బాగుంటుంది. పెట్టుబడి, షేర్ల వ్యాపారాలు ఆశాజనకంగా సాగుతాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

సభలు, సమావేశాలలో మీ సూచనలు సలహాలు ఆమోదయోగ్యం కాగలవు. శుభకార్య ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతాయి. ఖర్చులు కొన్ని అదనంగా ఉండగలవు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుం టుంది. మీరు ఇతరులకు సహాయం, ధనము మాట రూపంలో చేస్తారు. అనుకున్న పనులను పట్టుదలతో కొనసాగిస్తారు. శుభవార్తలు వింటారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

కొత్త వ్యాపారాలకు, పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగు లకు పని వత్తిడి పెరగడం, స్థానమార్పులుంటాయి. అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అదనంగా ఉం టాయి. షేర్లు లాభాలనిస్తాయి. కోపం, పట్టుదలలు పెరగకుండా ఇతరులతో సమస్యలు రాకుండా జాగ్రత్త పడాలి. ఆర్థిక స్థితి బాగుంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 27.11.2015 నుండి
తేది. 3.12.2015 వరకు

ఈ వారం మీనంలో కేతువు, మిధున కర్కాటక సింహరాశులలో చంద్రుడు, సింహంలో గురువు, కన్యలో కుజ రాహు శుక్రులు, 29తేది నుండి తులలో శుక్రుడు, వృశ్చికంలో రవి శని బుధులు సంచరిస్తారు.

### పంచాంగము:

**ముహూర్తములు**

తేది 27 శుక్రవారము ఉదయం గంట 8.05 నుండి 10.15లోగా ధనుర్లగ్నమున వివాహ వ్యాపార గృహారంభములు. రాత్రి గంట 11.40 నుండి గంట 1.50లోగా వివాహ గృహప్రవేశములు సింహలగ్నము.

**కార్తీక మాస కృష్ణపక్షతిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 27 | శుక్ర | విదియ | రా॥ గం.1.14వ॥ |
| తేది. 28 | శని | తదియ | రా॥ గం.12.20వ॥ |
| తేది. 29 | ఆది | చతుర్థి | రా॥ గం.11.56వ॥ |
| తేది. 30 | సోమ | పంచమి | రా॥ గం.12.00వ॥ |
| తేది. 1 | మంగళ | షష్ఠి | రా॥ గం.12.37వ॥ |
| తేది. 2 | బుధ | సప్తమి | రా॥ గం.1.14వ॥ |
| తేది. 3 | గురు | అష్టమి | రా॥ గం.3.17వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అవసరాలకు ఋణం చేయవలసి రావచ్చును. వాహనాలు నడిపేవారు, కరెంటు యంత్రాలతో పనులు చేసేవారు జాగ్రత్తగా ఉండండి. దూరప్రయాణాల వల్ల శ్రమ పడటం, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. అనుకున్న పనులకు ఆటంకాలెదురై నిదానంగా సాగు తాయి. తొందరపాటు నిర్ణయాలు, హామీలను ఇవ్వవద్దు. ఆదాయం ఖర్చులు సరిపోతుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

శుభకార్య నిర్ణయాలు జరగడం, దూరప్రయాణాలుం టాయి. కొత్త పరిచయాల వల్ల మనోధైర్యం పెరుగు తుంది. చక్కని ఆలోచనలు, ప్రయత్నాలలో ఆర్థికంగా పెరుగుదలకు కృషి చేస్తారు. ఒకటి రెండు వ్యాపార అవకాశాలు తప్పిపోయినా ఇబ్బంది ఉండదు. ఆదాయం సామాన్యం. కుటుంబసౌఖ్యం, విద్యా ప్రగతి బాగుం టుంది. కొత్త వ్యాపారాలకు తొందరపడవద్దు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

నిర్మాణాలు త్వరితగతిన సాగుతాయి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. కొత్త వస్తు వాహనాలను సమకూర్చుకొంటారు. ఇంటి సమస్యలు, వ్యవహార సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించగలరు. అనవసరపు ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు అభివృద్ధి ఆదాయం ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయంకాగలవు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

శుభకార్య నిర్ణయాలు జరగవచ్చును. ఉద్యోగుల సమర్థతకు గుర్తింపు లభిస్తుంది. అధికారులకు స్థాన మార్పులు, పర్యవేక్షణ బాధ్యతలు పెరుగుతాయి. ఈ వారం ఖర్చులు ఏదో ఒక రూపంలో పెరుగుతుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం అభివృద్ధి ఉంటుంది. సోదర వర్గంతో చిన్నచిన్న సమస్యలు రావచ్చును. అవస రాలకు ధనం అందుతుంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వస్తు వాహన రిపేర్లు ఖర్చులుండవచ్చును. ఆర్థిక ఇబ్బందులు తొలగి వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి రాబడి పెరుగుతుంది. పొదుపు పథకాలపై ఆలోచనలుంటాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు వాయిదా పడగలవు. ఆస్తి వ్యవహారాలు వాయిదా వేసికొనడం మంచిది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి వ్యాపారాలలో పరిస్థితి సామాన్యంగా ఉండి ఆదాయం సామాన్యంగానే ఉంటుంది. ఖర్చులు బాగా పెరుగుతాయి. ఆర్థిక ఇబ్బందులుండినా అవసరాలకు డబ్బు సర్దుబాటు కాగలదు. ఇతరులను నమ్మి ముఖ్య పనులు అప్పగించవద్దు. మీ పర్యవేక్షణ పనుల విష యంలో ఉండాలి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. పెట్టుబడులు, షేర్లపై లాభాలుంటాయి.

# కల్యాణ వైభవం...!



నెల్‌క్యాస్ట్ డిప్యూటి మేనేజింగ్ డైరెక్టర్ పేర్నేటి విజయభాస్కరరెడ్డి - విరజల కుమారుడు **వినయ్ - ప్రియాంక** (బెంగుళూరు వాస్తవ్యులు ఎన్.జనార్ధన్‌రెడ్డి - మంజుల కుమార్తె)ల వివాహం నవంబర్ 22వ తేదీన బెంగుళూరు జె.పి.నగర్‌లోని ఎలాన్ కన్వెన్షన్ సెంటర్ నందు, రిసెప్షన్ నెల్లూరు సిపిఆర్ కల్యాణ మండపం నందు వైభవంగా జరిగాయి. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



మాజీ ఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి మనుమరాలు, ఊటుకూరు శ్రీనివాసులురెడ్డి - శైలజల కుమార్తె **శ్రీత - సాహిల్** (చెన్నైలో వుంటున్న నెల్లూరుజిల్లా వాస్తవ్యులు మోపూరు కోదండరామిరెడ్డి - జనస్మితల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 22వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. మంత్రులు పత్తిపాటి పుల్లారావు, పి.నారాయణలతో పాటు జిల్లాలోని అన్ని పార్టీల ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ రంగాల ప్రముఖులు హాజరై వధూవరులను దీవించారు. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# ప్రభుత్వ సాయం అందరికీ అందాలి



కావలి కబుర్లు

కావలి నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా నష్టపోయిన వారందరికీ ప్రభుత్వం అందించే సాయం తప్పకుండా అందాలని శాసన సభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం అల్లూరులోని మాజీ శాసనసభ్యులు, వైసిపి సీనియర్ నేత కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమైన నాటి నుండి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటించానన్నారు. తుఫాను కారణంగా అన్ని మండలాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. బియ్యం పంపిణీలో అక్రమాలు చోటుచేసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెమాల సుకుమార్‌రెడ్డితో పాటు ఆయా మండల నాయకులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనం వల్లే గొప్పవారౌతారు



ఎంతోమంది విద్యావంతులు పుస్తకాలు పఠించడం వల్లే గొప్ప వ్యక్తులు కాగలిగారని విఆర్ కళాశాల గ్రంథాలయాధికారి డా॥ ఎన్.ప్రభాకర్ పేర్కొన్నారు. స్థానిక జవహర్‌భారతి డిగ్రీ కళాశాలలో టాంపో గ్రంథాలయంలో 48వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతోనే శ్రీశ్రీ గొప్ప కవి కాగలిగారని తెలియజేశారు. జె.బి కళాశాల డిగ్రీ ప్రిన్సిపాల్ ఎబిపి మనోహర్ మాట్లాడుతూ ఒక మంచి పుస్తకం ఎన్నో జీవితాలను ప్రభావితం చేస్తుందని, అందుకు నిదర్శనం మహాత్మాగాంధీ, అబ్రహం లింకన్‌లేనన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో ముందురోజు జెబి జూనియర్ కళాశాలలో పుస్తక పఠనావశ్యకత గురించి ఇంటర్మీడియట్ విద్య గుంటూరు డివిజన్ ఆర్‌జెడి వై.పరంధామయ్య విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. జెబి గ్రంథాలయాధికారి డి.వెంకట్రావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ టి.పోతురాజు, అధ్యాపకులు మధుసూదనరావు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, విఎస్‌యు పిజి సెంటర్ లైబ్రేరియన్ పాపయ్య, జెబి పిజి లైబ్రేరియన్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'గ్రంథాలయం – ప్రాముఖ్యత' అనే అంశంపై వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులు జి.క్రాంతికుమార్, ఎస్.ప్రతాప్‌రెడ్డి, బివిఎస్‌కె ప్రసాద్‌లకు నిఘంటువులను, ప్రశంసా పత్రాలను అందజేశారు.

# సిఎం దృష్టికి నక్కల కాలువ సమస్య



భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ముత్తుకూరు మండలంలోని పొట్టెంపాడు వద్ద గల నక్కల కాలువ ముంపుకు గురైంది. ఈ వాగు పొంగి ప్రవహించడంతో 27 గ్రామాలు ముంపుకు గురయ్యాయి. ఈ కాలువ క్రింద కొన్ని వందల ఎకరాల ఆక్వా గుంటలు కొట్టుకుపోయాయి. ఇటీవల వరదల పరిస్థితిని సమీక్షించడానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి జిల్లా తెలుగుదేశం నాయకులు పెళ్ళకూరు శ్రీనివాసులురెడ్డి ఈ సమస్యను తీసుకెళ్లారు. నెల్లూరు రూరల్‌లోని కనుపర్తిపాడు నుండి కండలేరు క్రీక్ వరకు 22కిలోమీటర్ల పొడవున వున్న ఈ కాలువ రివిట్‌మెంట్‌ను పూర్తి చేస్తే నెల్లూరు నగరంలో డ్రెయిన్ సమస్య పరిష్కారం కావడంతో పాటు సర్వేపల్లి రిజర్వాయర్‌కు నీటి మళ్లింపు సులభంగా వుంటుందని, ఈ సమస్యను పరిష్కరించాలని ఆయనను కోరారు.

# సహాయక చర్యల్లో అమరా సోదరులు





కావలి పురపాలక సంఘం పరిధిలో భారీ వర్షాల కారణంగా తీవ్రంగా నష్టపోయిన పలు ప్రాంతాల్లోని పేదలకు అమరా సోదరులు వేదగిరి, సుబ్బరాముడు గుప్తాలు స్వంత నిధులతో సహాయక కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా పురపాలక పరిధిలోని ముసునూరు 16వ వార్డు ప్రజలు వర్షాల సమయంలో నీటిలో చిక్కుకుపోగా వారికి ఆ వార్డు కౌన్సిలర్ వెంకటస్వామితో కలిసి ఆహారాన్ని అందించారు. అలాగే పట్టణంలోని 33, 34వార్డుల్లో ఆ వార్డు కౌన్సిలర్లు అమరా విజయలక్ష్మి, మల్లిశెట్టి విజయలక్ష్మిలు కూడా వార్డు ప్రజలకు బియ్యం పంపిణీ చేశారు. టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి పర్యవేక్షణలో వరద బియ్యం 10కేజీలు, ముంపుకు గురైన కుటుంబాలకు 25కేజీల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీహరినాయుడు, ఆత్మకూరి బ్రహ్మయ్య, రవిశేఖర్‌రావు, రాజ, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# హరిబాబుకు టాన్‌టెక్స్ పురస్కారం



అమెరికాలోని డల్లాస్, డెట్రాయిట్ నగరాల్లో దీపావళి సంబరాలను పురస్కరించుకుని ప్రవాసాంధ్రులు నిర్వహించిన వేడుకల్లో హాస్యనటుడు దోర్నాల హరిబాబు పాల్గొని నవ్వుల హరివిల్లు ప్రదర్శనతో అందరిని నవ్వులతో ముంచెత్తాడు. ప్రముఖ మిమిక్రి కళాకారుడు భవిరి రవి, బుల్లితెర యాంకర్ శ్యామల తదితరులు ఈ నవ్వుల హరివిల్లు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ టెక్సాస్(టాన్‌టెక్స్) ప్రతినిధులు నరశింహారెడ్డి ఊరుమిండి(అధ్యక్షులు), కృష్ణారెడ్డి ఉప్పలపాటి(సెక్రటరి) తదితరులు హరిబాబుకు అమెరికన్ టాన్‌టెక్స్ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ మన తెలుగు సంస్కృతి సంప్రదాయాలు మరచిపోకుండా అమెరికాలో ఇలాంటి సంబరాలను నిర్వహిస్తున్న టాన్‌టెక్స్ అసోసియేషన్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.

# లారీ డ్రైవర్లకు రెడ్‌క్రాస్ సాయం




ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగి అవస్థలు పడుతున్న వాహన డ్రైవర్లు, క్లీనర్లకు స్థానిక రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఆహార పొట్లాలను అందజేసారు. 21వ తేదీ వాహన రాకపోకలు స్థంభించడంతో ఆర్‌డిఓ లక్ష్మీనరశింహం సూచనల మేరకు కావలి రూరల్ సిఐ మధుబాబు, 2వ పట్టణ ఎస్‌ఐ అన్వర్‌బాషాల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రహదారిపై ముసునూరు నుండి ముంగమూరు వరకు నిలిచిపోయిన వాహన డ్రైవర్లు, క్లీనర్లు తినడానికి తిండి లేక, తాగడానికి మంచినీరు లేక కష్టాలు పడ్డారు. ఈ సమయంలో రెడ్‌క్రాస్ సాయం అందించడంతో వారు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌డిటి హరినాథ్, రెడ్‌క్రాస్ బాధ్యులు గంధం ప్రసన్నాంజనేయులు, మల్యాద్రి, డిబిఎస్, శ్రీసాయి, కళాశాల వాలంటీర్లు పాల్గొన్నారు.

# హడావిడి పనులతో ఒరిగేదేమీ లేదు



మంత్రులు హడావిడిగా కాలువలు తవ్వడం, రోడ్లను తవ్వడం వల్ల ఉపయోగమేమీ లేదని, తాత్కాలిక షోలతో ప్రజలను మభ్యపెట్టొద్దని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. బుధవారం ఆయన మనుమసిద్ధినగర్, ఖుద్దూస్ నగర్, మన్సూర్‌నగర్, పరమేశ్వరినగర్‌లలో పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు చెరువుకు వరద నీరు ఎక్కువగా వచ్చినప్పుడు ఈ ప్రాంతాలు జలమయం అవుతున్నాయని, వరద నీటిని పెన్నానదికి మళ్లించేలా ఒక ప్రణాళికను రూపొందించాలన్నారు. నగరంలో ఎక్కడెక్కడ డ్రైన్లు లేవో గుర్తించి యుద్ధప్రాతిపదికన వాటిని నిర్మించాలని ఆయన కోరారు. కాలువ కట్టలపై ఇళ్లు కట్టుకున్న వారికి ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాకే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గోగుల నాగరాజు, ఖలీల్ అహ్మద్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# శంభో... శంకరా...

## • భక్తి శ్రద్ధలతో కార్తీక పౌర్ణమి దీపోత్సవం





మనం జరుపుకునే పండుగల్లో కార్తీక మాసానికి ఎంతో ప్రాధాన్యత వుంది. పరమశివునికి అత్యంత ప్రీతిప్రదమైన మాసం. ఈ మాసంలో వచ్చే సోమ వారాల్లో పరమశివుని మనస్ఫూర్తిగా పూజిస్తే పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. కార్తీకదీపం పేరిట ఈ మాసంలో వెలిగించే ప్రతి జ్యోతి అజ్ఞాన తమిమిరాలను పారద్రోలి విజ్ఞాన రేఖలు విరబూయిస్తుందని, అందుకే దీపాలు వెలిగించడం మోక్షప్రదమని పురాణాలు చెబుతున్నాయి.

కార్తీక పౌర్ణమి సందర్భంగా నెల్లూరు జిల్లాలోని అన్ని శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం శివాలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగాయి. ఉదయం నుంచి సామూహిక మహన్యాస రుద్రాభిషేకాలు జరిగాయి. సాయంత్రం మహిళలు విశేషంగా పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. అన్ని ఆలయాల్లో చంద్రదర్శనం ఏర్పాటు చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నెల్లూరు తల్పగిరి రంగనాథస్వామి దేవాలయం, జొన్నవాడ కామాక్షి మల్లిఖార్జున స్వామి దేవస్థానం వద్ద పెన్నానదికి కార్తీక దీప హారతులు ఇచ్చారు. నెల్లూరు మూలాపేటలోని శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో తెల్లవారు జాము 4గంటలకు శ్రీ స్వామి అమ్మవార్లకు ఆలయ అర్చకులు మహన్యాసపూర్వక ఏకాదశరుద్రాభిషేకాలు, పాలాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. కార్తీకపౌర్ణమి సందర్భంగా ఉభయకర్త నూనె మల్లిఖార్జునయాదవ్ కార్తీకదీపాన్ని వెలిగించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దేవస్థానం ప్రాంగణంలో కార్తీకదీపాలు వెలిగించి నోములు నోచుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్ధన్‌రెడ్డి ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు. దర్గామిట్టలో కొలువైన శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో రమాదేవి సమేత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ కోదండ రామిరెడ్డి, ఛైర్మెన్ రత్నం జయరాం పాల్గొన్నారు.

స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వెయ్యి మట్టి శివలింగాలకు బిల్వతులశీ దళార్చన తదితర పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ మునగా వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు. దర్గామిట్టలోని శబరి శ్రీరామ క్షేత్రంలో సీతారామ కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సంతపేటలోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానంలో రమా సత్యనారాయణస్వామి కల్యాణోత్సవం కనులవిందుగా జరిగింది.

# 'చంద్ర' శాసనుడు

(మొదటి పేజీ తరువాయి)

ఎప్పుడూ మౌనంగా, ప్రశాంతంగా ఉండే చంద్రబాబు నెల్లూరులోని వరద పరిస్థితులు చూసి ఉగ్రనరసింహుడయ్యాడు. ఈ నెల 20, 21, 22తేదీల్లో ఆయన జిల్లాలో విస్తృతంగా పర్యటించి వరద ప్రాంతాలను పరిశీలించడం జరిగింది. ముఖ్యంగా నెల్లూరులో పలు ప్రాంతాలు నీళ్లలో మునిగిపోయి ఉండడాన్ని చూసి ఆయనకు అరికాల్లో మండింది. నగరంలోని పంట కాలువలన్నీ ఆక్రమణలకు గురై వుండడం, వాటి స్థలాల్లో ఇళ్లేకాక పెద్దపెద్ద వాణిజ్య భవనాలు కట్టి ఉండటం ఆయన దృష్టి కొచ్చింది. నగరంలోని పలు కాలనీలు మునిగిపోవడానికి ఈ కాలువలను ఆక్రమించడమేనని ఆయన గుర్తించాడు. ఇక్కడే మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నగరపాలక వర్గం, అధికారులపై నిప్పులు కక్కారు. ఈ సందర్భంగా ప్రతిపక్షం పాత్రను కూడా ఆయన ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ప్రతిపక్షం వీక్‌గా వుండబట్టి సరిపోయింది, లేకుంటే ప్రతిపక్ష నేత నాకంటే ముందుగా వచ్చి నెల్లూరులో ఈ సమస్యలపై దాడి మొదలుపెడితే మన పరిస్థితేంటని ఆయన తన పార్టీ వారిని ప్రశ్నించారు.

విశాఖపట్టంలో హుద్‌హుద్ తుఫాన్ కంటే ఈ వరదలేం పెద్ద సమస్య కాదు. ఇక్కడ గాలుల్లేవు, భారీ ప్రాణ, ఆస్తి నష్టాల్లేవు. కాని వీటిని మీరు మెయింటేన్ చేయలేకపోయారు. ఒకరికి ముగ్గురు మంత్రులను(దేవినేని, నారాయణ, శిద్దా రాఘవరావు) పంపాను. మీరు ఏం వెలగ బెట్టినట్లు? నేనొచ్చే దాకా ఎక్కడవేసిన గొంగళి అక్కడే వున్నట్లుంది. ఏదన్నా పని చేస్తే దానిపై పార్టీ ముద్రపడాలి. పని చేసేది ప్రభుత్వమే అయినా అది పార్టీకి ఉపయోగపడేలా వుండాలి. తెలుగుదేశం వాళ్లు కాబట్టి ఈ పని చేయగలిగారురా అనిపించుకోవాలి. మంత్రులై ఏడాది ఏడు నెలలైంది. మీరేం నేర్చుకున్నట్లు? అని మంత్రులకు చీవాట్లు పెట్టిన చంద్రబాబు పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్రకు కూడా అక్షింతలు వేసినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీతో పాటు పార్టీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు చూస్తున్నావు, జిల్లాలో నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకోలేకున్నావా అంటూ ప్రశ్నించారు. నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్, కార్పొరేటర్లపై కూడా ఆయన రుసరుసలాడారు. జన్మభూమి కమిటీలను నిర్వీర్యం చేసారంటూ కొందరు కార్యకర్తలు చేసిన ఫిర్యాదులపై చంద్రబాబు తీవ్రంగా స్పందిస్తూ జన్మభూమి కమిటీల ఆధ్వర్యంలోనే అన్ని పనులు జరగాలంటూ మేయర్‌ను ఆదేశించాడని సమాచారం. నెల్లూరు నగరంలో వరద బాధితులను ఆదుకోవడానికి మేం అది చేసాం, ఇది చేసామని చెప్పబోయిన నగర నాయకులపై కూడా చంద్రబాబు అసహనం వ్యక్తం చేస్తూ, మీరేం చేసారో నాకంతా తెలుసు, నా వద్ద డేటా వుంది అంటూ ట్యాబ్ ఓపెన్ చేసి 'వరదసహాయక చర్యలు బాగున్నాయని కేవలం 24శాతం మందే చెప్పారు, 40శాతం మంది ఫర్వాలేదన్నారు. మిగతా వాళ్లంతా అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. మీ పనితీరు ఎంత ఘోరంగా వుందో చెప్పడానికి ఇంతకంటే ఉదాహరణ ఏం కావాలన్నట్లు ఆయన కడిగేసారు.

చంద్రబాబు కన్నెర్రజేయడంతో నగరంలో కాలువల ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం చుట్టారు. పెద్దఎత్తున సర్వేయర్లు నగరంలో కాలువల ఆక్రమణలపై సర్వేలు చేపట్టి మార్కింగ్‌లు ఇస్తున్నారు. ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నారు. మార్కింగ్ తర్వాత ఆక్రమణలు తొలగించడం ఖాయంగా కనిపిస్తుంది. ఒకవేళ ఇప్పుడు తొలగించకపోతే భవిష్యత్‌లో ఇంకెప్పుడూ చేయలేరు.

# తెలుగు వెలుగులు

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ దాదాపుగా ఖాళీ అయ్యింది. పెద్ద నాయకులుగా మిగిలి వుండేది ఆనం సోదరులు, రఘువీరారెడ్డి లాంటివాళ్లే! ఆనం సోదరులు కూడా వెళ్లిపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ దాదాపు తుడిచిపెట్టుకుపోయినట్లే. విభజనతోనే ఏపిలో కాంగ్రెస్ పనైపోయింది. 2014 ఎన్నికలు ఈ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు ఏ గతి పట్టించాయో చూసాము. ఇక ఎంతకాలం కాంగ్రెస్‌లో వున్నా దండగే! ఈ రాష్ట్రంలో బలమైన పార్టీలుగా ఉండేది తెలుగుదేశం, వైకాపాలే! ఆనం సోదరులు వైకాపాలోకి పోలేరు. అక్కడకు పోలేనంతగా జగన్‌ను వాళ్లు బూతులు తిట్టారు. ఇక వారి రాజకీయ ప్రయాణానికి ప్రత్యామ్నాయ వేదిక తెలుగుదేశమే! కాబట్టి 'దేశం' వైపు మొగ్గు చూపారు.

ఇక్కడ చంద్రబాబుకు కూడా సమయానికి వాళ్ల అవసరం వచ్చి పడింది. జిల్లాలో తెలుగుదేశం నాయకత్వం బలహీనంగా వుంది. సోమిరెడ్డి ఆయనకు చాలడం లేదు. మంత్రి నారాయణ పబ్లిక్ లీడర్ కాదు. జిల్లానంతా మెయింటైన్ చేసే నాయకులెవరూ ఇక పార్టీలో లేరు. ఆనం సోదరులు పార్టీలో చేరితే తెలుగుదేశం బలహీనంగా వున్న నెల్లూరు నగరం, రూరల్‌తో పాటు ఆత్మకూరులోనూ పార్టీ బలపడుతుంది. ఈ వ్యూహంతోనే చంద్రబాబు వారికి స్వాగతం పలుకుతున్నాడు. బలమైన నాయకులు పార్టీలోకి వస్తామంటే తీసుకోమని ఆయన ఇంతకుముందే సంకేతాలిచ్చి వున్నాడు.

ఆనం సోదరులకు తెలుగుదేశం కొత్తేమీ కాదు. చంద్రబాబుతో ఎంతో సాన్నిహిత్యం వుంది. 1983లో ఆనం రామనారాయణరెడ్డి నెల్లూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగానే గెలిచారు. 1985లో అదే పార్టీ అభ్యర్థిగా రాపూరులో గెలిచారు. 1989లో నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డిని తెలుగుదేశం నుండి సస్పెండ్ చేసాక, రామనారాయణరెడ్డికి ఆర్ అండ్ బి మంత్రి పదవిని కూడా ఇచ్చారు. 1989లో ఆయన రాపూరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగానే ఓడిపోయారు. 1983 నుండి 1992 వరకు ఆనం సోదరులు తెలుగుదేశంలోనే వున్నారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు.

1992 నుండి 2015 నవంబర్ నెల వరకు కాంగ్రెస్‌తో ప్రయాణం సాగించారు. ఇప్పుడు కాంగ్రెస్ మునిగిపోతున్న పడవ. కాబట్టి రాజకీయంగా ఒడ్డున పడడం కోసం సురక్షితంగా వున్న తెలుగుదేశం ఓడను ఎక్కబోతున్నారు.

# వరదలతో దిగజారుడు రాజకీయం

## - వైసిపి నాయకుల ధ్వజం

భారీ వర్షాలతో వరదల్లో చిక్కుకుని జిల్లా ప్రజలు అల్లాడుతుంటే వారిని పట్టించుకోకుండా సిఎం చంద్రబాబు వరదలను రాజకీయం చేయడం దిగజారుడుతనమేనని వైయస్సార్‌సిపి నాయకులు ధ్వజమెత్తారు. మంగళవారం నెల్లూరు పొదలకూరురోడ్డులోని పార్టీ జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సిఎం సమీక్షల పేరుతో కాలయాపన చేశారన్నారు. బాధితులకు సహాయం అందించడంలో ప్రభుత్వం వద్ద డబ్బులు లేవంటున్న సిఎంకు పవన్ కల్యాణ్ కోసం ప్రత్యేక విమానాన్ని ఏర్పాటు చేయడానికి నిధులు వున్నాయా అంటూ విమర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబువి నీచ రాజకీయాలన్నారు. అర్ధరాత్రుల్లు అందరూ నిద్రపోయిన తర్వాత దెయ్యాలు తిరిగే వేళల్లో వరద బాధిత ప్రాంతాలను పరిశీలించడం ఎంతవరకు సమంజసం అన్నారు. నెల్లూరుజిల్లా జెడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ సిఎం రివ్యూ మీటింగ్‌ల వల్ల ఒరిగిందేమీలేదన్నారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా ప్రభుత్వం వంట సామాగ్రిని కొని బాధితులకు అందజేయాలన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కావలిలో వరద తీవ్రత ఎక్కువగా ఉందని, మత్స్యకారులు వరదలతో అల్లాడుతున్నారన్నారు. నష్టపరిహారం అందించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ వరదలతో గూడూరు డివిజన్ భారీ స్థాయిలో నష్టపోయిందన్నారు. మంత్రులు నారాయణ, సునీత 50వేల దుప్పట్లు ఇస్తామని చెప్పారని, ఇప్పటి వరకు కేవలం 10వేల దుప్పట్లు మాత్రమే పంచారన్నారు.

ఈ సమావేశంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, మాజీఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# తవ్వా రంగయ్య



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట పప్పులవీధిలోని శ్రీ పాండురంగ అన్నదాన సమాజం అధ్యక్షుడు తవ్వా రంగయ్య(69) మృతి చెందారు. అన్నదాన సమాజం అధ్యక్షునిగా 2002 నుంచి మూడుసార్లు ఎన్నికై ప్రస్తుతం అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతిచెందారని కుటుంబసభ్యులు తెలిపారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# తమిళనాట ఇక...
# తెలుగు జ్యోతి



- **తెలుగు విద్యార్థులు ఈ ఏడాది తెలుగులోనే పరీక్షలు రాసే అవకాశం**
- **ఎట్టకేలకు ఫలించిన ప్రొ. సిఎంకె రెడ్డి తదితరుల కృషి**

*"దేశ భాషలందు తెలుగు లెస్స" అన్న శ్రీ కృష్ణదేవరాయల పలుకులు ఈరోజుకూ మార్మోగుతూనే వుంటాయి. నిజమే, దేశ భాషలలో తెలుగు కన్నా మధురమైంది ఏముంది. తెలుగు శబ్దాలు, తెలుగు నుడికారాలు, తెలుగు పదాలు... భాషకు రుచి రూపమిస్తే తెలుగు అమృతమే!*

మాతృభాషను ప్రేమించడం, ఇతర భాషలను గౌరవించడం మన దేశంలో వున్న సంస్కృతి. కాని తమిళనాడులో మాత్రం ఇందుకు విరుద్ధ సంస్కృతి నెల కొంది. తమిళం ఒక్కటే భాష అన్నట్లుగా వుంటుంది వాళ్ల వ్యవహారం. తమిళనాట అరవభాషకు ప్రాధాన్యతనివ్వడాన్ని ఎవరూ ప్రశ్నించలేరు. అయితే ఆ రాష్ట్రంలో దాదాపు 40శాతం మంది మాట్లాడే తెలుగుభాషను లేకుండా చేయాలనుకోవడాన్నే అందరూ ప్రశ్నిస్తున్నారు. తమిళనాడు రాష్ట్రంలో తమిళం తర్వాత ఎక్కువ మంది మాట్లాడే భాష తెలుగు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో వున్నప్పటి నుండి కూడా తెలుగువాళ్లు తమిళనాడులో బాగానే స్థిరపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం ఏర్పడక ముందు చెన్నై నగరంలో తెలుగువాళ్లే ఎక్కువుగా వుండేవాళ్లు. ఆ రాష్ట్రంలో తమిళం తర్వాత గుర్తించి గౌరవించాల్సిన భాష తెలుగు.

ఎవరికైనా సరే మాతృభాష మీద మమకారం ఎక్కువగానే వుంటుంది. అందులోనూ తెలుగువారికి అది ఇంకా ఎక్కువే. పుట్టిన వూరునీ, కన్నతల్లినీ, మాతృభాషనీ మరువలేనివారు తెలుగువారంటే అతిశయోక్తేమీ కాదు. ఎక్కడ వున్నా, ఎందు కాలిడినా తెలుగువారికి తెలుగుభాష మాట్లాడడమే ఇష్టం. తెలుగులో చదువుకోవడం మరింత ఇష్టం. అయితే, తమిళనాడు ప్రభుత్వం మాత్రం తెలుగుకు ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వకపోవడం విచారకరం. ఈ నేపథ్యంలో, తమిళనాట తెలుగు వెలుగులు ప్రసరింపజేయాలని ఎంతోకాలం నుంచి ఆలిండియా తెలుగు ఫెడరేషన్ శక్తివంచన లేకుండా కృషి చేస్తోంది. ఆ ఫెడరేషన్ అధ్యక్షులు ప్రొఫెసర్ సిఎంకె రెడ్డి, మైనార్టీ సంస్థలు తదితరులంతా కలసి తమిళనాడు హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం ఆ మేరకు తెలుగు విద్యార్థులకు ఈ ఏడాది తెలుగులో పరీక్షలు రాసే వెసులుబాటు కల్పించాలని ప్రభుత్వానికి సూచించింది. తమిళనాడులో తెలుగు విద్యార్థులు తెలుగులో పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని, తద్వారా తమ మాతృభాషను గౌరవించుకోవాలని, మన అమ్మభాషను పరిరక్షించుకోవాలని తెలుగువారు ఎంతోకాలంగా విశ్వ ప్రయత్నం చేస్తూనే వున్నారు. ముఖ్యమంత్రిగా వున్నప్పుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడులతో పాటు, పలువురు మంత్రులు, మైనార్టీ సంస్థలు ఎంతగా కృషి చేసినప్పటికీ తమిళనాడు ప్రభుత్వం మాత్రం తమ మొండి పట్టు వీడలేదు. వచ్చే ఏడాది మార్చిలో జరుగనున్న పరీక్షలకు హాజరయ్యే 10వ తరగతి విద్యార్థులు దాదాపు 30వేల మంది దాకా వున్నారు. వారంతా ఇక ఈ ఏడాది కూడా తమిళంలోనే పరీక్షలు రాయాల్సివస్తుందేమోనని, ఇక తెలుగులో పరీక్ష రాసే అవకాశం రాకపోవచ్చని ఆవేదన చెందుతున్న తరుణంలో, సిఎంకె రెడ్డి సారధ్యంలో, తమిళనాడు లింగ్విస్టిక్స్ మైనార్టీల ఫోరమ్, మరికొన్ని ముస్లిమ్ సంస్థలు అన్నీ కలసి ఈ విషయమై తమిళనాడు హైకోర్టును ఆశ్రయించారు. తెలుగు విద్యార్థులకు తెలుగులో పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని న్యాయస్థానాన్ని కోరారు. వీరి అప్పీలు 23.11.2015న విచారణకు రావడంతో, అక్కడి న్యాయమూర్తులు వీరి అభ్యర్థనను పరిశీలించి, 10వ తరగతి చదివే తెలుగు విద్యార్థులు ఈ ఏడాది తెలుగులోనే పరీక్షలు రాయవచ్చు అని తీర్పు చెప్పడంతో తమిళనాడులోని తెలుగుప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది. సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులు తమ అభ్యర్థనను ప్రభుత్వానికి పంపితే, 30 రోజుల్లోగా ఆ మేరకు వారికి తెలుగులో పరీక్షలు రాసేందుకు అనుమతి లభించేలా చూడాలని, ప్రభుత్వం సానుభూతితో ఈ మినహాయింపు అమలయ్యేలా చూడాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. దీంతో, ఒక్క తెలుగు విద్యార్థులకే కాక, మైనార్టీ విద్యార్థులందరికీ ఈ మినహాయింపు లభిస్తుంది. అంతేకాదు, ఈ మినహాయింపు మరిన్ని సంవత్సరాలు కొనసాగాలంటే మరిన్ని వివరాలతో కోర్టుకు అప్పీలు చేసుకోవచ్చని కూడా హైకోర్టు సంబంధిత న్యాయవాదులకు సూచించింది. ఏదేమైనా, ఈ ఏడాది తమిళనాడులోని తెలుగు విద్యార్థులు తమ మాతృభాష తెలుగులోనే పరీక్షలు రాసే అవకాశం వచ్చింది. ఇంతకంటే ఆనందం ఇంకేమి కావాలీ?.. గతంలో ఈ విషయమై 2006లో చేసిన చట్టాన్ని ప్రభుత్వం సక్రమంగా అమలుచేయకపోవడాన్ని కూడా న్యాయస్థానం ఈ సందర్భంగా ప్రశ్నించింది. ఈ మినహాయింపు తెలుగువారికే కాక, తమిళనాడులో వున్న ఇతర మైనార్టీలకు, ఉర్దూ, మలయాళం, కన్నడం, హిందీ తదితర భాషలు మాట్లాడేవారికి కూడా వర్తిస్తుంది. ఈ తీర్పు ద్వారా, తమిళనాడులో తొలిసారిగా తెలుగు విద్యార్థులకు ఎంతో ఊరట కలిగించినట్లయింది. తమిళనాడులో తెలుగు వెలుగులు ప్రకాశమానమయ్యేందుకు అవకాశం కల్పించిన న్యాయమూర్తులకు, తమిళనాడు హైకోర్టుకు, ప్రత్యేకించి ఈ విషయమై ఇంతకాలం ఎంతగానో కృషి చేస్తున్న ప్రొఫెసర్ సిఎంకె రెడ్డి తదితరులందరికీ తెలుగువారి తరపున 'లాయర్' అభినందనలు.



శ్రద్ధాంజలి

ప్రజలందరికీ స్నేహపాత్రుడు
మంచితనానికి మార్గదర్శకుడు

కీ॥శే॥ శ్రీ మాగుంట సుబ్బరామరెడ్డి గారు
ఒంగోలు పార్లమెంటు మాజీసభ్యులు

20వ వర్ధంతి సందర్భంగా వారి పవిత్రాత్మకు
శాంతి కలగాలని ప్రార్థిస్తూ..






కుటుంబ సభ్యులు
మరియు బంధుమిత్రులు

తేది: 1-12-2015, మంగళవారం ఉదయం 11గం॥లకు
నెల్లూరు, రంగనాయకులపేటలోని శ్రీరాఘవ కళ్యాణమండపమునందు
అన్నదాన కార్యక్రమము జరుగును.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com